www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
సోమవారం 14, జూలై, 2025 | పేజీలు :12

## కోట ఇక సెలవు..



ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసిన కోట శ్రీనివాసరావు
గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నవైనం
కోటకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన పెద్దమనవడు శ్రీనివాస్

02

# లాకౌట్ డ్రామా

**ఆంధ్ర పేపర్ మిల్లు లాకౌట్ .. తర్వాత రోజు ఎత్తివేత.. ఇదే తంతు మూడోసారి.**
**కార్మికులు, కార్మిక సంఘాలు,**
**వామపక్షాలు, రాజకీయ నాయకులందరూ నిర్లక్ష్యం**
**కొత్త పరిశ్రమలకు దిక్కులేదు... ఉన్నవాటిపై శ్రద్ధ లేదు..**
**నాడు 1961లో రోజుకు పది టన్నుల ఉత్పత్తి అనుమతి..**
**నేడు 2025లో రోజుకి 25 వేల టన్నుల ఉత్పత్తి...అయినా అవే అనుమతులు**
**వందేళ్లు పూర్తయిన పాత అనుమతితోనే కొనసాగింపు..**
**నోరు మెదపని పర్యావరణ బోర్డు లేబర్ కమిషనర్...**




సిహెచ్ శ్రీ, టీపీఎన్: తూర్పు గోదావరి జిల్లాలో అసలే పారిశ్రామిక ప్రగతి లేక అభివృద్ధి తిరోగమనంలో ఉంటే ఇప్పుడు ఆంధ్రా పేపరుమిల్లు లాకౌట్ అయ్యింది. కొంత హైడ్రామా అనంతరం లాకౌట్ని ఎత్తివేశారు. డిమాండ్లు నెరవేరకపోయినా కార్మికులు సమ్మెను విరమించడంపై ఇది హైడ్రామాని తలపించింది. 2023 కాలానికి చెందిన వేతన ఒప్పందం అమలు కాకపోవడం, పలు డిమాండ్ల పరిష్కారం కనిపించడం లేదు సెప్టెంబర్ 2వ తేదీ నుండి 25వ తేదీ వరకూ అంటే 25 రోజులు కార్మికులు సమ్మెకు దిగారు. ఇదే రీతిలో 2024, జూలై నెలలోనూ, 2025 మళ్లీ జులై నెలలోనూ యాజమాన్యం స్పందింకపోగా అర్ధాంతరంగా మిల్లు లాకౌట్ ప్రకటన, లాకౌట్ పై ఇటు కార్మిక సంఘాల నేతలుగాని, అటు కార్మిక సంఘాల నాయకులు గాని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. దాఖలాలు లేవు. ఇదే సమయంలో యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తూ లాకౌట్ ప్రకటించింది. దీన్ని బట్టి ప్రజాప్రతినిధులు, స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కూడా యాజమాన్యంపై పోరాడలేక పోయారంటే వీరంతా యాజమాన్యంతోనూ, యాజమాన్యం ప్రతినిధులైన కొందరు అధికారులతో ఏ స్థాయిలో చీకటి ఒప్పందాలు పెట్టుకున్నారో స్పష్టమౌతుంది. ఇదంతా కార్మికులకు తెలిస్తే తమ డిమాండ్లు మాట దేవుడెరుగు ఏదో మిల్లు తెరిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఉద్యోగం చేసుకోవచ్చనే భావనతోనే జిల్లాకలెక్టర్, ఎస్పీలతో జరిగిన చర్చలు సఫలీకృతం అయినట్లు ఉద్యోగులు సమ్మె విరమించినట్లు తెలుస్తుంది. వాస్తవానికి వైకాపా అధికారంలోకి వచ్చి "ఏళ్లు పూర్తవుతుంది. ఈ ఐదేళ్లు తూర్పులో పారిశ్రామిక తూర్పు పూర్తిగా లేకుండా పోయింది. ఇప్పటికీ ఏర్పాటు బిక్కవోలులో గ్రాసిం కంపెనీ, కొవ్వూరు ప్రాంతంలో త్రివేణి మెగా సోలార్ ప్యానల్ పరిశ్రమలు, ఇటీవలే రాజానగరంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ , శంకుస్థాపన తప్ప పెద్దగా పారిశ్రామికాభివృద్ధి లేదనే చెప్పాలి. గత నెలలో రాజానగరంలో మంత్రి అమర్నాథ్ ప్రారంభించిన ఇండస్ట్రియల్ ఎస్టేట్ బోర్డు కూడా కనుమరుగైపోయిందంటే ఇక్కడ పారిశ్రామిక ప్రగతిని అర్ధం చేసుకోవచ్చు. అధికార పార్టీ నిర్లక్ష్యవైఖరి లేదా స్థానిక నాయకులు ఉదాశీనవైఖరి కారణంగానే సుమారు 3వేల మంది ఉన్నారు మంది కార్మికులు పనిచేస్తున్న రోజుకూ 20వేల టన్నుల ఉత్పత్తిని సాధించే పేపరుమిల్లు లాకౌట్ అయ్యిందంటే స్థానిక నాయకులు స్వార్థప్రయోజనాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్ధం చేసుకోవచ్చు. ఇప్పటికే జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో అత్యధిక శాతం మూతపడింది. ఉన్న జిఎంఆర్, జివికె లాంటి విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలు నిలిచిపోయాయి. స్పిన్నింగ్ మిల్లులు, సామిల్లులు, సిరామిక్ పరిశ్రమలు జాడలేకుండా పోయాయి. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. మన నాయకులకు కొత్త పరిశ్రమలను తీసుకురావడం తెలియదు. అలాగే ఉన్న పరిశ్రమలను నిలుపుకోవడం కూడా చేతకాదని ఆరోపణలు ఉన్నాయి. ఇక వామపక్షాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కూడా తమ స్వార్థ ప్రయోజనాలతో ఉన్నారు పరిశ్రమలను తాకట్టు పెట్టి కార్మికుల ప్రయోజనాలను గారికి వదిలేసారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్ర పేపర్ మిల్లు లాకౌట్ ఈ ఆరోపణలను నిజం చేస్తున్నాయి.

**నాటకీయ పరిణామాల మధ్య పేపరుమిల్లు లాకౌట్..... అనంతరం ఎత్తివేత....**

రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. గత 23 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రధాన ద్వారం వద్ద పోలీసులు మోహరించారు. లోపలివారు బయటకు రాకుండా, బయటివారు లోపలికి రాకుండా గేటు మూసి వేశారు. పాత వేతన ఒప్పందం గడువు జూన్ 30, 2020లో ముగియడంతో, కొత్త వేతన ఒప్పందం కోసం కార్మికులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. గత నెల 26వ తేదీన సమ్మె నోటీసు ఇచ్చిన విషయం విధితమే. ఈ నెల 2వ తేదీ నుంచి దాదాపు 2800 మంది సమ్మెలో ఉన్నారు. దీంతో ఈ నెల 4న ఏలూరు జైంట్ కమిషనర్ (జేసీఎల్) ఎ. రాణి మాట్లాడినా ఫలితం లేకపోవడంతో యాజమాన్యాలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు కానీ అది కూడా వాయిదా పడింది. మళ్లీ 12వ తేదీన లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చర్చలు జరిపినా యాజమాన్యం సానుకూలంగా లేకపోవడం వల్ల విఫలమైంది. మరుసటి రోజు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవి లత, ఎస్పీ జగదీష్ సమక్షంలో చర్చలు జరిగాయి అయితే ఈ సమావేశానికి మిల్లు యజమానుల ప్రతినిధుల్లో, మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హాజరుకాలేదు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి... జీతాల ఒప్పందం, ఇతర డిమాండ్ల దృష్టి ఇటీవల కార్మికులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తీసుకెళ్లారు. ఈ యాజమాన్యం బ్లాకౌట్ ప్రకటన బోర్డుపై పెట్టడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అక్రమ బాకౌట్ ఎత్తివేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మిక సంఘాలకు నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడం దారుణమని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ జిల్లా అధికారులతో కలిసి చర్చలు జరిపిన అనంతరం కార్మికుల సమ్మెను విరమించడంతో పేపరుమిల్లు యాజమాన్యం లాకౌట్ని ఎత్తివేసినట్లు ప్రకటించారు.

**కార్మిక సంఘాలు మొక్కుబడి పోరాటం....**

సుమారు 25రోజుల పాటు పేపరుమిల్లు కార్మికులు సమ్మె చేయడం, మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించడం, అనంతరం జిల్లా కలెక్టర్ కార్మికులతో చర్చించిన అనంతరం కార్మికుల సమ్మెను విరమించుకోవడం, మిల్లు యాజమాన్యం లాకౌట్ని ఎత్తివేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నా కార్మికుల తరపున కార్మిక సంఘాల నాయకులు మాత్రం తీవ్ర స్థాయిలో పోరాటం చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మిక సంఘాల నాయకులు మాత్రం ఏదో మొక్కుబడిగా ఒక ప్రెస్ మీట్ పెట్టి చేతులు దులుపుకుంది. ఈప్రెస్మీటో కూడా ప్రస్తుతం ఫోర్స్‌లో ఉన్న యూనియన్ నాయకులు చిట్టూరి ప్రవీణ్ చౌదరి కూడా హాజరుకాలేదంటే కార్మిక సంఘాల నాయకులు మధ్య సమన్వయం ఏ స్థాయిలో ఉందో స్పష్టమౌతుంది.

**పేపరుమిల్లు ప్రస్థానం....**

1921లో, ఈ మిల్లు ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమండ్రిలో కర్నాటిక్ పేపర్ మిల్స్ లిమిటెడ్ స్థాపించబడింది. దాని ప్రారంభ సంవత్సరాల్లో మిల్లు ఎటువంటి లాభాలను ఆర్జించలేదు మరియు చివరికి దివాలా కారణంగా రద్దు చేయబడింది. 1929లో, కర్నాటిక్ పేపర్ మిల్స్ లిమిటెడ్ ఆస్తులను స్వాధీనం చేసుకున్న ఆంధ్రా పేపర్ మిల్స్ కంపెనీని ఏర్పాటు చేశారు. 1953లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, రాజమండ్రి మిల్లును ఆంధ్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో దీని సామర్థ్యం 10 టన్నులు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు పారిశ్రామికవేత్త సోమాని మధ్య జైంట్ వెంచర్ ఒప్పందం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు పరిమిత పేరుతో ఏర్పడే కొత్త కంపెనీకి ఆస్తులను బదిలీ చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. దీని ప్రకారం, కంపెనీ జూన్ 29, 1964న కంపెనీల చట్టం, 1956 కింద విలీనం చేయబడింది. 1966లో, సోమాని తన హక్కులు మరియు బాధ్యతలను వెస్ట్ కోస్ట్ పేపర్ మిల్స్ లిమిటెడ్‌కు బదిలీ చేశాడు, దాని యాజమాన్యాన్ని 1981లో దిగ్విజయ్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిమితికి బదిలీ చేసింది. అనంతరం ఈ కంపెనీ 2011 వరకు ఎల్.ఎన్.బంగూర్ల కుటుంబ వ్యాపారంగా మారింది. 2011లో, ఆంధ్ర ప్రదేశ్ పేపర్ మిల్స్ లిమిటెడ్. 1898లో స్థాపించబడి 30 శాతం బిలియన్ల అమెరికన్ పల్ప్ మరియు పేపర్ కంపెనీ అయిన ఇంటర్నేషనల్ పేపర్ (ఐసి ) కొనుగోలు చేయబడింది. మొదటి ముఖ్యమైన దేశీయ కొనుగోలులో ఒక విదేశీ పేపర్ కంపెనీ ద్వారా, ఐపి కంపెనీలో 75% వాటాను కొనుగోలు చేసింది. బావి అనేది ప్రపంచంలోనే అతిపెద్ద పల్ప్ మరియు పేపర్ కంపెనీ, 24 దేశాల్లో సుమారు 61,500 మంది ఉద్యోగులు ఉన్నారు. భారతదేశంలోని అతిపెద్ద సమగ్ర కాగితం మరియు పల్ప్ తయారీదారులలో ఈ పేపరుమిల్లు ఒకటి. 1964లో స్థాపించబడిన ఈ సంస్థ విదేశీ మరియు దేశీయ మార్కెట్ల కోసం రైటింగ్, ప్రింటింగ్ మరియు కాపీయర్ పేపర్లను ఉత్పత్తి చేస్తుంది. రాజమండ్రి మరియు కడియం వద్ద కూడా ఉత్పత్తి సౌకర్యాలు (రీసైకిల్ యూనిట్ సహా) మొత్తం ఉత్పత్తి మిగతా 2లో..

## పెట్టుబడులే లక్ష్యంగా స్పేస్ పాలసీ

- స్పేస్ పాలసీ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- ఐదేళ్ల కాలానికి వర్తించేలా స్పేస్ పాలసీ
- సత్యసాయి, తిరుపతి జిల్లాలో ఏర్పాటు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలానికి వర్తించే కొత్త అంతరిక్ష విధానాన్ని (స్పేస్ పాలసీ) ప్రకటించింది. ఈ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర స్పేస్ సిటీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ స్పేస్ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడం వంటి లక్ష్యాలను మిగతా 2లో..



## చంద్రబాబు సింగపూర్ టూర్

- ఈనెల 26న సింగపూర్ వెళ్తొన్న సీఎం
- పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 30 వరకు ఆయన పర్యటన సాగనుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు బృందం అక్కడి ప్రభుత్వ పెద్దలు, వివిధ మిగతా 2లో..



## పేర్నినానిపై మరో కేసు

- విజయవాడ వన్‌టౌన్‌లో కేసు నమోదు
- పేర్నినానిపై కేసు పెట్టిన మైనార్టీ నాయకులు

**విజయవాడ:** మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పేర్ని నానిపై విజయవాడలో ఆదివారం మరో కేసు నమోదైంది. పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ మైనార్టీ నాయకులు ఫతావుల్లా, ఆషాలు.. విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పేర్ని నానిపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాలని మైనార్టీ నేతలు కోరారు. ఏపీ మంత్రి నారా లోకేష్ సైగా చేస్తే పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న స్తంభానికి కట్టేసి పేర్ని నానిని కొడతామని ఫతావుల్లా, ఆషాలు మిగతా 2లో..



## రాజధాని ప్రజల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

**రాజధానిలో భూములు లేని పేదలకు ఫింఛన్**
**1,575 కుటుంబాలు పింఛన్లకు అర్హులుగా గుర్తింపు**

**అమరావతి:** రాజధాని అమరావతిలో భూమి లేని పేదలకు పింఛన్‌ను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజధాని గ్రామాల్లోని 1,575 కుటుంబాలకు పింఛన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పింఛన్లను రద్దు చేసింది. కూటమిప్రభుత్వం దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన మంత్రిమండలి భేటీలో పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలోనే రాజధాని నిర్మాణంలో జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు పింఛన్లను మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2015లో జరిపిన ఇంటింటి సర్వే ఆధారంగా 1,575 కుటుంబాలు పింఛన్లకు అర్హులుగా గుర్తించారు. మరోవైపు నేలపాడులో ప్రజాప్రతినిధులు, అధికారుల క్వార్టర్స్ పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.524.70 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. 18 టవర్లలో 432 అపార్ట్‌మెంట్ యూనిట్ల నిర్మాణం జరుగుతోంది.



## భూ కేటాయింపులపై సంచలన నిర్ణయం

**బీజేపీ స్టేట్ ఆఫీసుకు రెండు ఎకరాల భూమి**
**మొత్తం 7 సంస్థలకు 32.4 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు**

**అమరావతి:** ఏపీ రాజధాని అమరావతిలో రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి 2 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ కార్యాలయంతో పాటు కొత్తగా 7 సంస్థలకూ ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఒక్కొక్క సంస్థకు 32.4 ఎకరాలు 60 ఏళ్ల లీజు ప్రతిపాదికన భూమిని కేటాయించింది. కేబినెట్ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ కేటాయింపులు జరిపింది. అంబికా, గెయిల్ సంస్థలకు ఇచ్చిన గత కేటాయింపు రద్దు చేసింది. అలాగే 6 సంస్థలకు ఇచ్చిన భూములపై సవరణలు చేయడంతో పాటు మళ్లీ కేటాయింపులు చేసినట్లు పేర్కొంది. అలా కొత్తగా 7 సంస్థలకు 32.4 ఎకరాలను కేటాయింపులు జరిపింది. ఈ మేరకు మున్సిపల్ & అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది.

# కోట ఇక సెలవు..

- ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసిన కోట శ్రీనివాసరావు
- గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైనం
- కోటకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన పెద్ద మనవడు శ్రీనివాస్



**హైదరాబాద్:**

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు గారి అంత్యక్రియలు ముగిశాయి. సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ఆయన అంత్యక్రియలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. ఆయన పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఫిల్మ్ నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర సాగింది. వందలాది మంది సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు కడసారి నివాళులర్పించారు. మెగాస్టార్ చిరంజీవి, ప్రకాశ్ రాజ్, వెంకటేశ్, రానా దగ్గుబాటి వంటి పలువురు సినీ ప్రముఖులు కోట శ్రీనివాసరావుకు నివాళులర్పించారు. చిరంజీవి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వీరిద్దరూ ఒకే సినిమాతో (ప్రాణం ఖరీదు, 1978) తమ సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర రాజకీయ ప్రముఖులు కూడా ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావు తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. నాలుగు దశాబ్దాలకు పైగా తన సినీ జీవితంలో 750కి పైగా సినిమాల్లో నటించారు. ఆయన విలక్షణమైన నటనకు, ముక్కుసూటి వ్యక్తిత్వానికి పేరుగాంచారు. పద్మశ్రీ పురస్కారం, 9నంది అవార్డులు అందుకున్న కోట శ్రీనివాసరావు 1999 నుండి 2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు.

# లాకౌట్ డ్రామా

**మొదటిపేజీ తరువాయి**

సామర్థ్యం 240,000 టన్నులు ఉండగా ఈ కంపెనీ దాదాపు 2,500 మంది ఉద్యోగులను కలిగి ఉంది మరియు హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉంది. డిసెంబర్, 2013లో, కంపెనీ పేరు "ఇంటర్నేషనల్ పేపర్ లిమిటెడ్'గా మార్చబడింది.

**పేపరుమిల్లుకు మరొకవైపు......**

ఆంధ్రా పేపరుమిల్లు అంటేనే రాష్ట్రంలో ఒక గుర్తింపు ఉంది. రోజుకు 20వేల టన్నులు ఉన్నతి చేస్తూ 2800 మంది కార్మికులకు జీవనోపాధిని కల్పించడమే కాకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా కూడా 10వేల మందికి ఉపాధి కల్పిస్తున్న ఆంధ్రాపేరుమిల్లు (ఇంటర్నేషనల్ పేపరుమిల్లు) ఇప్పుడు అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటుంది. నాడు 1961లో రోజుకు 10 టన్నుల ఉత్పత్తికే అనుమతులు పొందిన పేపరుమిల్లు నేడు అంటే 2024లో రోజుకు 20 వేల టన్నుల ఉత్పత్తిని సాధిస్తుంది. అంటే ఇప్పటికీ 102 ఏళ్లు పూర్తిచేసుకున్న పేపరుమిల్లు అప్పటి అనుమతులతోనే కొనసాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పర్యావరణాన్ని తూట్లు పొడుస్తూ పవిత్ర గోదావరి కలుషితం చేస్తున్న పేపరుమిల్లుపై సానిక నాయకులు ఏనాడూ గొంతెత్తిన పాపాన పోలేదు. అలాగే పేపరుమిల్లులో పనిచేసే యాజమాన్య ప్రతినిధులైన ఇక్కడ నిర్వహిస్తున్న అవినీతి, అక్రమాలపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# చంద్రబాబాబు సింగపూర్ టూర్

**మొదటిపేజీ తరువాయి**

వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వారికి వివరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా తెలియజేస్తారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేస్తున్న విదేశీ పర్యటనలు రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైనవిగా భావిస్తున్నారు. గతంలో కూడా ఆయన పలుమార్లు విదేశాల్లో పర్యటించి భారీ ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలమయ్యారు. సింగపూర్ పర్యటన కూడా అదే కోవలో జరుగుతుందని భావిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా సింగపూర్ మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య సంబంధాలు మరింత బలపడతాయని ఆశిస్తున్నారు. అంతేకాకుండా, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు ఉత్తమ విధానాలను కూడా స్వీకరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# పెట్టుబడులే లక్ష్యంగా స్పేస్ పాలసీ

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం పెట్టుకుంది. దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా చేసుకోవాలని సూచించింది. స్పేస్ సిటీ కార్పొరేషన్ అంతరిక్ష ప్రాజెక్టుల అమలుకు సహాయం చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పేస్ సిటీలు సత్యసాయి మరియు తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేయబడతాయి. భూ కేటాయింపులు మరియు దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియలు ఒక కమిటీ ద్వారా అనుమతులు పొందుతాయని ప్రభుత్వం తెలియజేసింది.

# పేర్నినానిపై మరో కేసు

**మొదటిపేజీ తరువాయి**



హెచ్చరించారు. ఇంకోసారి రెచ్చగొట్టే మాటలు పేర్ని నాని మాట్లాడకుండా గుణపాఠం చెబుతామని మైనార్టీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. పామర్రులో పేర్ని నాని వ్యాఖ్యలపై కృష్ణా జిల్లా అవనిగడ్డలో టీడీపీ నేత శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. పేర్నినాని వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఎంఎస్ఎంఈల పురోగతికి బీఈఈ సరికొత్త పథకం అదితి

- ఇంధన సామర్థ్యంలో కేంద్ర ప్రభుత్వ నూతన పథకం
- ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి ఏడీఈఈటీఐఈ (అదితి) పథకం రూపకల్పన
- ఈనె 15న పానిపట్‌లో ఈ పథకాన్ని ప్రారంభించనున్న కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి

**పానిపట్:**

రాష్ట్రాల ఆదాయ వనరుకు మూలస్థంభంలాంటి సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) (అదితి) రంగంలో అత్యాధునిక ఇంధనసమర్థవంతమైన సాంకేతికతలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ విప్లవాత్మక ముందడుగు వేసింది. ఈరంగాన్ని వేగవంతం చేయడంపై దృష్టి సారించిన బీఈఈ తొట్ట తొలిసారిగా పరిశ్రమల స్థాపనలలో ఇంధన సమర్థవంతమైన సాంకేతికతలను అమలు చేయడంలో సహాయం చేసేందుకుగానూ ఏడీఈఈటీఐఈ (అదితి) అనే పథకాన్ని ప్రారంభించనుంది. పారిశ్రామిక రంగంలో పోటీతత్వాన్ని పెంచడం, ఉపాధిని సృష్టించడం, ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడంతోపాటు దేశ వాతావరణ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాల్లో ఈ పథకం ఒక రోల్ మోడల్‌గా నిలవనుంది. ఏడీఈఈటీఐఈ (అదితి) జాతీయ రోల్‌అవుట్ వేడుక జూలై 15న హర్యానాలోని పానిపట్‌లో జరుగనుంది. ఇది దేశ ఇంధన సామర్థ్యం, వాతావరణ మార్పు ప్రయాణంలో ఒక కీలక అంశంగా ప్రశంసించబడుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర విద్యుత్ మరియు గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్, హర్యానా విద్యుత్ మంత్రిత్వ శాఖ నుండి సీనియర్ ప్రముఖులతో కలిసి ఆయన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ప్రతినిధులు, బీఈఈ మధ్య అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి.

**ఎంఎస్ఎంఈలకు ప్రపంచ స్థాయి ఇంధన సమర్థతవంతమైన సాంకేతికత**


అదితి అనేది దేశంలోని ఎంఎస్ఎంఈలను ప్రపంచ ఇంధనసమర్థవంతమైన సాంకేతికతలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ పథకం ఎంఎస్ఎంఈలకు సాంకేతిక సహకారం, రుణాలపై వడ్డీ రాయితీ, అవసరమైన ఇతర ఏర్పాట్లు వంటి వాటిని సమకూరుస్తుంది. పరిశ్రమల్లో విద్యుత్ ఖర్చులను తగ్గించడానికి, ఉత్పాదకతను పెంచడానికి సహాయపడుతుంది. ఇదే సమయంలో దేశంలో స్వచ్ఛమైన ఇంధన పరివర్తనలో ఎంఎస్ఎంఈల పాత్రను బలోపేతం చేయడానికి వీలు కల్పిస్తుంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ నుండి సీనియర్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం)తో సహా దేశంలోని అన్ని రాష్ట్రాలచే నియమించబడిన ఏజెన్సీల (ఎస్‌డీఏ) ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ వాటాదారులు, ఆర్థిక సంస్థలు ఈజాతీయ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఒదొక నిర్మాణాత్మక చొరవ

ఏడీఈఈటీఐఈ అనేది ఒక నిర్మాణాత్మక చొరవ అని బీఈఈ దక్షిణ ప్రాంత మీడియా సలహాదారు చెప్పారు. పానిపట్ వేదికగా ప్రారంభమయ్యే ఈ పథకం దేశ పారిశ్రామిక ఇంధన పరివర్తనలో ఒక విప్లవాత్మక మార్పును సూచిస్తుందన్నారు. ఎంఎస్మాఎంఈ ర్యకలాపాల ప్రధాన భాగంలో ఇంధన సామర్థ్యాన్ని పొందుపరచడంలో ఏడీఈఈటీఐఈ ఒక మైలురాయిగా నిలచిపోతుందన్నారు. అటు ఇంధన సామర్థ్య చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు ఇటు పచ్చదనం, ఆర్థిక వృద్ధికి మార్గాన్ని సుగమం చేస్తుందని చెప్పారు. 2030 నాటికి దేశ జీడీపీలో ఉద్గారాల తీవ్రతను 45 శాతానికి తగ్గించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఇంధన సామర్థ్య రంగంలో జాతీయ లక్ష్యాలను చురకునేందుకు దోహదపడటంతోపాటు క్షేత్ర స్థాయిలో స్థిరమైన పారిశ్రామికీకరణ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకం ఎంఎస్ఎంఈ రంగాన్ని ఇంధనస్మార్ట్ తయారీ మరియు వాతావరణ సమతుల్య నమూనాగా మార్చడానికి సహకరిస్తుందని వెల్లడించారు. ఏడీఈఈటీఐఈ పథకాన్ని వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి సహకరించినందుకు విద్యుత్ మంత్రిత్వ శాఖకు బీఈఈ కృతజ్ఞతలు తెలిపిందన్నారు. ఈఈ పైలట్ ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసినందుకు అనేక రాష్ట్రాలను ప్రశంసించిందని తెలిపారు. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బంగారు ఆభరణాలు (విజయవాడ), వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు (మచిలీపట్నం), ఫుడ్ ప్రాసెసింగ్ (చిత్తూరు), ఫార్మాస్యూటికల్స్ (అచ్యుతాపురం) వంటి కీలక రంగాలలోని ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో డీకార్బనైజేషన్ మరియు ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. సంబంధిత క్లస్టర్లకు గణనీయమైన విద్యుత్ మరియు ఆర్థిక పొదుపుకు దోహదపడ్డాయన్నారు. ఏడీఈఈటీఐఈ పథకం దేశ విస్తృత వాతావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. వీటిలో 2030 నాటికి ఉద్గారాల తీవ్రతను 45 శాతానికి తగ్గించడం, 2070 నాటికి నికర జీరోను సాధించడం వంటివి ఉన్నాయని వివరించారు.

# ఉపాధ్యాయులు గర్వించే గురువులు

- మా మంచి మాస్టారి కి సెల్యూట్ అంటున్న విద్యార్థులు
- విద్యార్థుల ఇక్కట్లు చూడలేక సొంత డబ్బుతో వంతెన నిర్మాణం
- స్ఫూర్తిదాయకమైన చర్యతో ప్రశంసలు...



తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే. ఆ జన్మకు సార్ధకత చేకూర్చేది గురువులే. అందుకే గురుబ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వర : అని త్రిమూర్తులతో పోలుస్తారు. ఒకప్పుడు గురు, శిష్యులకు ఎంతో అనుబంధం ఉండేది. కానీ ఈ మధ్య కాలంలో పుస్తకాల్లోనే పాఠాలు విద్యార్థులకు బోధించి మమ అనిపించుకునే గురువులు తయారయ్యారు. కొంతమంది విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించడం, దారుణంగా కొట్టడం, తిట్టడం లాంటివి చేస్తున్నారు. అలాంటిది ఒక బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఒక పాఠశాల ఉపాధ్యాయులు వినయంగా ఆలోచించారు. ఆ గురువు చేసిన పనికి విద్యార్థులే కాకుండా తల్లిదండ్రులు, గ్రామస్థులు సైతం హేట్సాఫ్ అంటున్నారు.

**ఇంతకి ఆ మాస్టార్ ఏంచేశారు, అంత మంది ప్రేమను ఎలా పొందారో చదువుదాం....**

ఇటీవల సర్కాల్ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు స్కూల్కి రాలేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో కొన్ని గ్రామాల్లో పేదరికాన్ని భరించలేక తమ పిల్లలను పాఠశాలల్లో చేర్చలేని పరిస్థితి. విద్యార్థులు స్కూల్ కి రావడానికి దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ఓ మాస్టర్ ఎవరూ ఊహించిన విధంగా ఓ చక్కటి పనిచేశాడు.ఇప్పుడు ఆ మాస్టర్ చేసిన పనివల్ల విద్యార్థులు సంతోషంలో ఉన్నారు. కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, సూరంపేటలోని శ్రీకొప్పెల కేవలానందం అచ్చియమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాలల్లో గత సాధారణంగా విద్యార్థుల హాజరు తగ్గుతూ వస్తుంది. దీనికి కారణం ఏంటని అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ అనిశెట్టి సీతారామరాజ అనే అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మాత్రం ఆలోచించాడు. ఎందుకు విద్యార్థులు స్కూల్కి రాలేకపోతున్నారని విద్యార్థులను ఆరాతీశాడు. మాకు రావడానికి సరైన బాట మార్గం, వంతెన లేదని వారంతా చెప్పిన సమాధానంతో చలించిపోయిన ఉపాధ్యాయుడు సీతారామరాజు, ప్రస్తుతం సూరంపూడి ప్రాథమిక పాఠశాలలో 5గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరి సంఖ్యను పెంచాలని నిర్ణయించుకున్నాడు. అయితే పాఠశాలకు వెళ్ళాలంటే విద్యార్థులకు రైల్వే అండర్ పాసేజ్ వద్ద ఉన్న మురిగికాలువ ప్రక్కనుంచే ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తుందని గ్రహించాడు. దీని కోసం లక్ష రూపాయలు తన సొంత ఖర్చుతో సమీపంలోనే పంటకాలువ మీదుగా కాలిబాట వంతెన నిర్మించాడు. ఈ వంతెన పై నుండి రావడం వల్ల విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు రావడానికి వీలుకలగనుంది. ఉద్యోగం చేసే ఎంతోమంది ఉపాధ్యాయులు వచ్చామా, పాఠాలు చెప్పామా, ఇంటికి వెళ్లామా అనే ఆలోచనలో ఉన్నారు. కాని వీటికి భిన్నంగా సీతారామరాజు లాంటి గొప్ప మనస్సున మాస్టారు మా ఊరికి రావడం మా అదృష్టం పిల్లలు చేసుకున్న పుణ్యం గ్రామం అంటూ సదరు ఉపాధ్యాయుని సేవలను అందించారు. కొనియాడుతున్నారు.

ఇది ఎలా ఉండంగా నేటిజన్స్ మాత్రం మాస్టర్ సేవలను కొనియాడుతూ అదే సమయంలో ప్రభుత్వాన్ని దుయ్య పెడుతున్నారు. ఎంత పెద్ద వ్యవస్థ ఉన్న ప్రభుత్వం ఒక చిన్న కాలిబాట నిర్మించలేకపోయడం వింటుంటేనే సిగ్గుగా ఉందంటూ ఆరోపిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలు ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు పాఠశాల పరిస్థితిని ఏ స్థాయిలో చూస్తున్నారో దీన్ని బట్టి స్పష్టమవుతుందంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు.

**నా బాధ్యత మరింతగా పెంచేలా ఉంది...**

నేను విద్యార్థులు ఎందుకు ప్రభుత్వ పాఠశాలకు రావడం లేదని ఆరాతీయడంతో, నరైన సౌకర్యాలు లేకపోవడంతోనే లేదని విద్యార్థులు చెప్పడంతో కొంత బాధకలిగింది. అందుకే నేను డబ్బులు అని చూడకుండా విద్యార్థు కోసం కాలిబాట వంతెన సొంత నిర్మాణం చేపట్టాను. ఈ విషయం తెలుసుకున్న విద్యాశాఖాధికారి (డిఈవో) మా స్కూల్‌కి రావడం సంతోషకరంగా ఉంది. వారి మాటలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. వారి మాటల్లో నా మరింత బాధ్యతగా పెంచిందని చెప్పారు.



# మాతృభాష అమ్మ..హిందీ భాష పెద్దమ్మ..!

ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన "మాతృభాష అమ్మ లాంటిది, హిందీ పెద్దమ్మ లాంటిది" వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై మాతృభాష ప్రేమికులు, భాషా సంఘాలు సహా నటుడు ప్రకాశ్ రాజ్ వంటి వారు తీవ్రంగా స్పందిస్తుండడం చర్చనీయంశంగా మారింది.



గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం 'రాజభాష విభాగం స్వర్ణోత్సవ సమ్మేళనం' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ "మన మాతృభాష అమ్మ అయితే హిందీ పెద్దమ్మ'' అని వ్యాఖ్యానించడం చర్చకు దారితీసింది. హిందీ మనది అని.. ఆ భాషను ప్రేమిద్దాం అని, ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. హిందీని రాజభాషగా ఆయన అభివర్ణించారు. నాగరికత ముసుగులో ఆంగ్ల భాషను సొంతం చేసుకున్న మనమే హిందీని మనభాష అని అనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, వ్యాపారాల కోసం ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి భాషలు నేర్చుకుంటున్నామని, మరి.. మన దేశానికే చెందిన హిందీ నేర్చుకునేందుకు ఎందుకు భయపడుతున్నాం? ఆ భాషను ఎందుకు ద్వేషిస్తున్నాం? అని ప్రశ్నించారు. హిందీ నేర్చుకోవాలని ఎవరినీ బలవంతం చేయడం లేదని, అయితే అది ఎవరైనా తేలిగ్గా అర్థం చేసుకోగలిగే భాష అని ఆయన ప్రసంగం కొనసాగింది. లాభం ఉందనుకున్నప్పుడు కొందరు హిందీని నిస్సంకోచంగా ఉపయోగిస్తూ అదే హిందీని చిల్లర రాజకీయాల కోసం వ్యతిరేకిస్తున్నారని తనదైన శైలిలో స్పందించారు పవన్ కళ్యాణ్.

నిజానికి మాతృభాష కన్నా హిందీ భాషపై పవన్ కళ్యాణ్ కు మక్కువ ఎక్కువైంది అన్న విధంగా పలువురు నెట్టింట్లో కామెంట్లు పెడుతున్నారు. గతంలో ఇదే పవన్ కళ్యాణ్.. హిందీ భాష అనేది బిజెపికి సొంతమని హిందూ భాష కాదు, హిందీ భాష బిజెపికి సొంతం అన్న వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. హిందీ భాష పెద్దమ్మ లాంటిది అనడం వెనుక ఉత్తరాది ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ నెత్తినపెట్టుకోవడం అంటూ అసహనం వ్యక్తమవుతోంది. ఈ రేంజ్ కి అమ్ముడుపోవడమా? ఛీ ఛీ అంటూ విమర్శకులు , నటులు ప్రకాశ్ రాజ్ వంటి వారు తీవ్రంగా స్పందించారు. 800 ఏళ్లుగా మనుగడలో ఉన్న హిందీ భాష 2వేల ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తెలుగు భాష పెద్దమ్మ ఎలా అవుతుందో చెప్పాలని భాషాభిమానులు సైతం ప్రశ్నిస్తున్నారు. హిందీ భాష కావచ్చు..కానీ అందరి భాష హిందీ కావాలనుకోవడాన్ని దక్షిణాది అంగీకరించదు. ఏ భాషనైనా గౌరవించాలి..కానీ బలవంతంగా ఎక్కించాలనుకోకూడదు. అన్ని భాషలతో కలిసి నడవాలి కానీ ఒక భాషలోనే అందరూ నడిస్తే అది భిన్నత్వంలో ఏకత్వం అన్న భారతదేశ సిద్ధాంతాన్నే తుడిచివేయడం కాదా? విభిన్న కులాలు, మతాలు, భాషలైనా కలిసి నడిచే ఏకైక దేశం మన భారతదేశం అన్న మాట పవన్ కళ్యాణ్ మరిచారా? ఒక తాటిపైన నడవడం, నడిపించడం అవసరమే కానీ ఒక భాషతోనే జీవించాలని చెప్పడమే ఎవరూ హర్షించరు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో పవన్ భవిష్యత్ ను లిఖించిన అమ్మ భాష కన్నా లిపి లేని భాషపై అంత ప్రేమెందుకు? అంటూ ఆంధ్రా మేధావుల సంఘం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మండిపడ్డారు. హిందీ పెద్దమ్మ అయితే ఇంగ్లీష్ పిన్ని, రష్యా అత్త అంటూ కొందరు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. ఏ మేరాజహా అంటూ ఖుషీ సినిమాలో హీరోయిజం పాటను కూడా హిందీపై అభిమానంతో పెట్టానని పవన్ చెప్పడం మరింత హాస్యాస్పదం. బీజేపీ మెప్పు పొందడమే లక్ష్యంగా పవన్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ చాలా మంది కామెంట్ చేస్తున్నారు. ఇంత గొప్పగా పెద్దమ్మ అంటూ హిందీ గురించి మాట్లాడిన పవన్ కళ్యాణ్ గతంలో ఇదే హిందీ భాష గురించి 2019 ఎన్నికలకు ముందు విభేదించినపుడు మాట్లాడిన విషయాలన్నీ తెరపైకి తెచ్చి ప్రశ్నిస్తున్నారు. అప్పుడు రాజ్యాంగాన్ని , రాష్ట్రాన్ని అగౌరవపరచడమే అని పవన్ మాట్లాడిన మాటలు ఒక్కసారిగా ఇలా మారిపోయాయేంటంటూ నిలదీస్తున్నారు. ప్రొఫెసర్ కె నాగేశ్వర్ ఓ టీవీ ఛానల్ విశ్లేషణలో పవన్ కళ్యాణ్ హిందీ భాషపై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇంగ్లీష్ ఇంటి అల్లుడిలా మారిపోయి..పెద్దమ్మ, అమ్మను కూడా పక్కనపెట్టేలా పరిస్థితులు తయారయ్యాయని ఆయన విశ్లేషించారు. ఎవరు అవునన్నా కాదన్నా హిందీని బలవంతంగా రుద్దడం, తప్పనిసరిగా నేర్చుకోవాలనే హుకుం తగదన్నారు. అత్యంత మాతృభాష ప్రేమికులైన తమిళులు, తమిళ్, హిందీ భాషలతోనే రాణిస్తున్నారన్నారు. ఏ రంగంలో తమిళనాడు వెనుకబడిందో చెప్పాలని ప్రశ్నించారు.

# నాయకుడిగా కాదు... సేవకుడిని

- ప్రజల సాక్షిగా ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకునే బాధ్యత మాది.
- ప్రజల గుండెల్లో పేరుకుపోయిన సమస్యలే ఇప్పుడు నా యజ్ఞం.
- అర్హత ఉన్నవారికి న్యాయం చేయడమే నిజమైన సంక్షేమం.



**ధర్మవరం:-**

ధర్మవరం ప్రజల గుండెల్లో ఎన్నాళ్లుగానో పేరుకుపోయిన సమస్యలను తెలుసుకోవడమే ఈ పాదయాత్రల ఉద్దేశం అన్నారు మంత్రి సత్యకుమార్ యాదవ్. ధర్మవరం పట్టణంలోని 21వ, 22వ వార్డుల్లో ఆదివారం మూడవ రోజు నిర్వహించిన అభివృద్ధి పాదయాత్రలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా విన్నారు. ఈ పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.తనకు ఓటేసి గెలిపించిన ప్రజలకు సమస్యలే పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు మంత్రి సత్యకుమార్. పాదయత్రలో ప్రజలను కలిసినప్పుడు ఇల్లు మంజూరైంది అని చెబుతున్నారు. కానీ స్థలం ఎక్కడుందో తెలియదు వారికి. పట్టా ఇచ్చారు – కానీ ఎక్కడ ఉందో తెలియదు. ఇది ప్రజలకు మిగిలిపోయిన అస్పష్టత అన్నారు. ఇందుకు హౌసింగ్ మరియు సచివాల సిబ్బందిని ఆదేశించడం జరిగిందన్నారు. స్థలాలను గుర్తించి, ఎవరు ఏ ఆప్షన్ కింద ఉన్నారో స్పష్టంగా రికార్డు చేయమని చెప్పడం జరిగిందన్నారు. ఒక్కొక్కరి సమస్య వెనక నిజం తెలుసుకోవడమే పరిష్కారానికి మొదటి అడుగు అని చెప్పారు. పెన్షన్ సమస్యలపై విషయానికొస్తే 75 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు, అంగవైకల్యం, ఒంటరి మహిళలు – ఇవాళ పింఛన్లు లేవంటున్నారు. కారణం? పార్టీకి చెందిన వారంటూ గత ప్రభుత్వం రాజకీయంగా విడదీసింది. ఇది మానవతా విరుద్ధం అని ఫైర్ అయ్యారు మంత్రి. అర్హత ఉన్నవారికి పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. అదే నేను చేస్తున్నాను అన్నారు. అన్యాయంగా తీసేసిన ప్రతి పింఛన్ తిరిగి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాని హామీ ఇచ్చారు. ఈ బాధను రాజకీయ పరిగణనలో కాదని నిబద్ధతగా చూస్తున్నాం. మౌలిక సదుపాయాల విషయానికొస్తే ఇవాళ తాగునీటి సమస్యను ప్రతికూలంగా వినిపించాను. అమృత్ పథకంలో గతంలో మంజూరైన ట్యాంకుల నిర్మాణాలు పూర్తికాలేదు. అందుకే డైరెక్ట్ పంపింగ్ చేస్తూ తాత్కాలికంగా నీరు ఇస్తున్నాం. కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదు. త్వరలో ట్యాంక్‌లు పూర్తవుతాయి. అప్పటివరకు నీటి పంపిణీ యథాశక్తి చేస్తాం. ఆ తర్వాత తాగునీటి సమస్య ఎక్కడా ఉండదు – ఇదే మా కృషి. అలాగే చేనేత సమస్యల విషయానికొస్తే ధర్మవరం చేనేతలకు కొత్త శక్తి ఇవ్వాలనే లక్ష్యంతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు కేంద్రం ఇన్ ప్రిన్సిపల్ ఆమోదం తెలిపింది. కేంద్రం నుంచి 30 కోట్లు, రాష్ట్రం నుంచి 10 కోట్లు కలిపి మొత్తం 40 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నాం. మార్కెట్ యార్డులో స్థలాన్ని కేటాయించాం. టెండర్లకు సిద్ధంగా ఉన్నాం. ఇది 20వేల మందికి ఉపాధిని కల్పించడమే కాక, మార్కెటింగ్ వ్యవస్థ కూడా చేనేతల చేతిలోకి వస్తుంది. అలాగే గత ఐదేళ్లలో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ పాడయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఏరియాల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే 87 కిలోమీటర్ల స్టేట్ హైవే అప్గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. ఇందులో 27 కిలోమీటర్ల బైపాస్ రోడ్ కూడా ఉంది. ఇది ధర్మవరం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. అంతేకాకుండా ఇవాళ ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు – ఈ ఒక్క సంవత్సరం కూటమి పాలన చాలా సంతృప్తికరంగా ఉంది అని. వారు ఇప్పటికే 33,000 కోట్లతో పింఛన్లు, 10,000 కోట్లతో తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీలు, రైతులకు మద్దతు వంటి పథకాలను గుర్తుచేస్తున్నారు. మళ్లీ వీటిని అమలు చేయగలిగిన నాయకత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపంలో, పవన్ కళ్యాణ్ గారి రూపంలో ఉందని విశ్వాసంతో ఉన్నారు. ఇది మాకు బాధ్యతను మరింత పెంచుతోంది. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంపై ప్రశంసలతో మాట్లాడుతూ —— ఇవాళ దేశం మూడోసారి నరేంద్ర మోడీ గారిని ప్రధానిగా ఎన్నుకుంది. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ప్రజల విశ్వాసానికి నిదర్శనం. విశ్వనాయకుడిగా ఆయన ప్రపంచానికి నూతన భారతాన్ని చూపిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ అదే రీతిగా ప్రజల ఆశలకి తగిన నాయకత్వం అందించేందుకు మేమంతా కృషి చేస్తాం. ఇది ఎలాంటి రాజకీయ విమర్శలకో, వయస్సు మీద కామెంట్లకో స్పందన కాదు. ఇది నిబద్ధతతో నడిపే శ్రమకు ప్రతిఫలం. పాదయాత్రలో ప్రజల నుంచి వందలాది వినతులు స్వీకరించిన మంత్రి గారు, వెంటనే వాటిని అధికారులకు అప్పగించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల బాధనే నా బాధ. వారి ఆశలే నా లక్ష్యం. నేను మాట ఇచ్చిన దానిని కచ్చితంగా నెరవేర్చే వరకు నడుస్తాను, వింటాను, పోరాడుతాను, అంటూ మంత్రి ధర్మవరం ప్రజల హృదయాలను స్పృశించేలా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్ హయాంలో వ్యవస్థలన్నీ నాశనం



- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి
- రామయ్యపట్నం అభివృద్ధికి సిద్ధంగా ఉన్నా

**అనకాపల్లి:**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలు వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. జగన్ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయిందని విమర్శించారు. ఆదివారం యస్ రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామంలో హోం మంత్రి అనిత పర్యటించారు. రామయ్యపట్నంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రామయ్యపట్నం గ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఏపీలో ఇప్పుడు ఎన్నికలు లేవని.. ప్రజల యోగక్షేమాలని తెలుసుకోవడానికే తాను రామయ్యపట్నం వచ్చానని చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభమవుతుందని..త్వరలోనే నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు హోం మంత్రి అనిత. రామయ్యపట్నం గ్రామంలో తీర్మానాలు ఇవ్వకపోవడంతోనే ఈ గ్రామం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని అన్నారు. రామయ్యపట్నం గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా రామయ్యపట్నం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో టాయ్ పరిశ్రమ వస్తే, 25 వేల మంది మహిళలకు ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. జిల్లాకు స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ వస్తే ..పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# గుడివాడ ఘటనపై తెలుగు మహిళానేతల ఆగ్రహం



- హారిక కారు తిరిగి రావడం వెనుక కుట్ర ఉంది
- పేర్నినాని వ్యాఖ్యలు దురదృష్టకరమంటూ మండిపాటు

**గుడివాడ:**

గుడివాడలో వైసీపీ నేతలు డ్రామా సృష్టించారని ఫైర్ అయ్యారు గుడివాడ తెలుగు మహిళ, జనసేన వీర మహిళలు. మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. జిల్లాకు ప్రథమ పౌరురాలైన ఉప్పాల హారిక వైఎస్ఆర్ పార్టీ సమావేశానికి ప్రభుత్వ వాహనంలో ఎందుకు రావాలి అని ప్రశ్నించారు. సమావేశానికి వెళ్లకుండా తమ కార్యకర్తలు అడ్డుకుని పంపించివేస్తే తిరిగి మరల అక్కడకు ఎందుకు రావాలని ప్రశ్నించారు. తిరిగిరావడంలోనే కుట్ర దాగి ఉందన్నారు. మా తెలుగుదేశం నాయకులను కార్యకర్తలను కారుతో తొక్కించేందుకు ప్రయత్నం చేసిందంటూ వ్యాఖ్యానించారు. ఉప్పల హారిక భర్త మాట్లాడిన అసభ్య పదజాలం ఎంతవరకు సమంజసమని, రప్ప రప్ప అంటూ చీకట్లో కన్ను కొట్టాలంటూ రెచ్చగొట్టిన పేర్ని నాని డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఏమి చేశారని, జగన్ మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి నీ రప్ప రప్ప అంటూ తెల్లవారే సరికి కన్నుకొట్టేసారని, డాక్టర్ సుధాకర్‌ను రప్ప రప్ప చేశారని, ఎంతమంది ఎస్సీ ఎస్టీ బీసీలను రప్పా రప్పా చేస్తారంటూ ఎద్దేవా చేశారు. ప్రజలు , వైసిపి కార్యకర్తలతో సహా వైసిపి వారి వాహనాలకు దూరంగా ఉండాలని లేదంటే క్రింద పడేసి తలలు తొక్కి చేస్తారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు దురదృష్టకరమని అన్నారు.

# విద్యుత్ వ్యవస్థను వైసీపీ సర్వనాశనం చేసింది

- విద్యుత్ శాఖపై రూ. 1.30 లక్షల కోట్ల భారాన్ని మోపింది
- భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు
- జగన్‌పై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం



**బద్వేల్:**

భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రసక్తి లేదని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ శాఖపై వైసీపీ ప్రభుత్వం రూ. 1.30 లక్షల కోట్లకు పైగా భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సోలార్ ఎనర్జీకి 7 వేల మెగావాట్లను ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. అయితే గత ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి ప్రభుత్వం ఒక్క మెగావాట్ విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తుందని, రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీకి అనువైన ప్రదేశమని తెలిపారు. రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులను తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ మేరకు స్పష్టం చేశారు. సీమలో పెట్టుబడులు రావడం కారణంగా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పన జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వినియోగించుకోవాలని మంత్రి గొట్టిపాటి కోరారు.

**విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష...**

బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కడప జిల్లాలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనుల్లో పురోగతిపై అధికారులతో చర్చించారు. అలాగే జిల్లాలో సబ్‌స్టేషన్ల నిర్మాణం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు పగటిపూటనే 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు. గృహాలకు, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు మంత్రి గొట్టిపాటి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి**

బద్వేల్ నియోజకవర్గంలోని బాలాయపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని, ఇప్పటికే దీపం పథకం కింద ఉచితంగా మూడు సిలిండర్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ గుర్తు చేశారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తల్లికి వందనం పథకం కోసం ఒక్కరోజే ప్రజల ఖాతాల్లో సుమారు రూ. 10 వేల కోట్లు జమ చేశామని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజాస్వామ్యాన్ని వైసీపీ ఖూనీ చేస్తోంది

- వైసీపీ నేతలపై మంత్రి కొల్లు ఘాటు వ్యాఖ్యలు
- హింసాత్మక రాజకీయాలు, కుట్రలు కొనసాగిస్తే ప్రజలు ఊరుకోరు
- వైసీపీ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర . వైసీపీ నాయకత్వం రాష్ట్రంలో



**మంగళగిరి:**

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు చేస్తోందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి పైశాచిక రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉందన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కారును టీడీపీ నాయకులు వదిలేశారని, అయితే ఆమె కావాలనే తిరిగి వచ్చి పోలీసులను, టీడీపీ నాయకులను దుర్భాషలాడారని ఆరోపించారు. ఈ సంఘటనను టీడీపీ నాయకత్వానికి అంటగట్టి, రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు.ఈ ప్రయత్నంలో వైసీపీ విఫలమైందన్నారు మంత్రి కొల్లు. రాష్ట్రమంతా భగ్గుమనిపించాలని చూసి అడ్డంగా బుక్ అయిపోయారు... ఈ కుట్రల వెనుక వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. అయితే వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని కొల్లు రవీంద్ర విమర్శించారు.ఇప్పుడు రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేయడానికి వైసీపీ నాయకులు పూనుకున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా, పరిశ్రమలు ఏర్పాటు కాకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలను రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుడివాడలో సభ పేరుతో రాద్ధాంతం సృష్టించడం, బీసీ మహిళను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడటం వైసీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

మరోవైపు మాజీ మంత్రి పేర్నినాని పామర్రు సభలో 'చీకట్లో కన్ను కొడితే నరికేయాలి' అని మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి కొల్లురవీంధ్ర. ఇలాంటి రాక్షస ఆలోచనలు వైసీపీ నాయకులకు సర్వసాధారణం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు మానవత్వం లేని పైశాచిక రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలు వారి నీచ ఆలోచనలను గుర్తిస్తున్నారని హెచ్చరించారు. పెట్టుబడులు తీసుకొచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు మా నాయకులు తాపత్రయపడుతున్నారని చెప్పారు. కానీ, వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అశాంతిలోకి నెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలు, కుట్రలు కొనసాగిస్తే ప్రజలు ఊరుకోరని మంత్రి హెచ్చరించారు. "వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా బుద్ధి రాలేదన్నారు. ప్రజలు వారి దుర్మార్గాలను మరచిపోలేదన్నారు. రాష్ట్రంలో వైసీపీ జాడ కూడా లేకుండా పోతుందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించే నాయకుడు చంద్రబాబు అని, టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని వైసీపీ నేతలు ఖూనీ చేయాలనుకుంటున్నారని ఫైర్ అయ్యారు.

# బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు

- ఒన్ డిస్ట్రిక్ట్... ఒన్ ప్రాడక్ట్ క్రింద ఎంపిక
- నేడు ఢిల్లీలో అవార్డును అందుకోనున్న కలెక్టర్



దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన బొబ్బిలి వీణకు మరో అరుదైన గుర్తింపు లభించింది. ఒన్ డిస్ట్రిక్ట్... ఒన్ ప్రొడక్ట్ (ఓడిఓపి) క్రింద బొబ్బిలి బహుమతి వీణ ఎంపికయ్యింది. ఓడిఓపి అవార్డుకు రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపిక కాగా, బొబ్బిలికి చెందిన నమూనా వీణ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని అందుకొనేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఢిల్లీ వెళ్లారు. కొత్తఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఓడిఓపి అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు.

**బొబ్బిలి వీణకు అంతర్జాతీయ గుర్తింపు**

బొబ్బిలి వీణకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి వీణ' అని విస్తృతంగా పిలువబడే బొబ్బిలి నుండి వచ్చిన సాంప్రదాయ 'సరస్వతి వీణ' విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. అలాగే సర్వస్వతి వీణను పోలిఉండే చిన్నపాటి వీణను బహుమతిగా, జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలుగా ఇవ్వడం జరుగుతోంది. బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో జరిగిన జి20 సదస్సులో, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో సైతం బొబ్బిలి వీణ ప్రదర్శనలు జరిగాయి. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చట పడ్డారు. బొబ్బిలి వీణకు ఇప్పటికే మన కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది.

**బొబ్బిలి వీణ తయారి**

బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లిలో వీణలు తయారీకి ప్రసిద్ధి చెందింది. వీణల తయారీ ఒక అరుదైన హస్త కళగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలోని దాదాపు 300 కుటుంబాలు గత 100 సంవత్సరాలకు పైగానే తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నాయి. బాడంగి మండలం వాడాడలో కూడా ప్రస్తుతం వీణలు తయారవుతున్నప్పటికీ, వాటికి కూడా బొబ్బిలి వీణలుగానే పరిగణిస్తున్నారు. వీటి తయారీకి పనస మరియు సంపంగి కలప చెక్కను ఉపయోగిస్తారు. వీణల తయారీకి కలప కొరతను నివారించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తృతంగా పనస చెట్లను పెంచాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది. ఓడిఓపి క్రింద బొబ్బిలి వీణకు గుర్తింపు లభించడంతో, వీటి ఖ్యాతి మరింత ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు.

# నేటి నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**విజయవాడ:**

ఇవాళ్టి నుంచి కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.*

అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.



రాష్ట్రంలో ఫోటో జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ అవశ్యకత ఎంతో అవసరం అన్నారు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, నూతన ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్. విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (APPJA ) సర్వసభ్య సమావేశం ఆదివారం అధ్యక్షుడు వి జయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఏపీపీజేఏకి అన్ని వేళలా ఏపీయూడబ్ల్యూజే పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులు, మాఫియా ముఠాల నుండి ఫోటో జర్నలిస్టులు తరచూ భౌతిక దాడులకు గురవుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీపీజేఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా జీవి నారాయణరావు (ఆంధ్రజ్యోతి), అధ్యక్షులుగా సిహెచ్. వివిఎస్ విజయభాస్కరరావు (ఆంధ్రపత్రిక), వర్కింగ్ ప్రెసిడెంట్ గా వి.రూబెన్ బెసాలియల్( సాక్షి), ప్రధాన కార్యదర్శి జి మహేష్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), కోశాధికారి సిహెచ్ నారాయణరావు(డెక్కన్ క్రానికల్ ), ఉపాధ్యక్షులు కే. గిరిబాబు (తిరుపతి _ మనం), సుధాకర్ (కర్నూలు _ హంస), కొమ్మూరి శ్రీనివాస్ (ఒంగోలు, హిందూ), సంయుక్త కార్యదర్శులు ఎన్ సాంబశివరావు ( సీనియర్ ఫోటో జర్నలిస్ట్), ఎస్ శివకుమార్ (ఆంధ్రజ్యోతి,చిత్తూరు), సిహెచ్.వి. మస్తాన్(హాన్స్ ఇండియా, విజయవాడ), Shaik రియాజ్ ( సాక్షి, ఏలూరు), మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



## ఫ్లెక్సీ వివాదం.. జనసేన శ్రేణుల ఆందోళన

**మచిలీపట్నం:**

కృష్ణా జిల్లా మచిలీపట్నం బైపాస్ రోడ్డులో అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. దివంగత నేత, వంగవీటి మోహనరంగా ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంతో జనసేన శ్రేణులు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీ చించివేయడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సకాలంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. దీంతో జనసేన శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా ఫ్లెక్సీలు చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ ఫ్లెక్సీని సైతం చించివేశారని ఆరోపించారు. ఫ్లెక్సీలను చించి వేస్తున్న వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఎవరి మీద అనుమానం లేదు.. అలాగని ఫ్లెక్సీ చించిన వ్యక్తి కనిపిస్తే మాత్రం వదలిపెట్టం అని హెచ్చరించారు జనసైనికులు



## గంజాయి గుట్టురట్టు.. నిందితులు అరెస్ట్

**తెనాలి:**

పట్టణంలో గంజాయి విక్రయం గుట్టురట్టైంది. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముఠాను రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ ఉమేశ్, ఎస్సై ఆనంద్ మాట్లాడుతూ నిందితుల అరెస్ట్ వివరాలను తెలియచేశారు. తెనాలికి చెందిన ప్రకాశరావు, ప్రదీప్, శివ నాగరాజు, ప్రశాంత్ కిరణ్ లు చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి తెనాలి, గుంటూరు, విజయవాడ రైల్వే స్టేషన్లలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. టిట్కో గృహాల దగ్గర వారిని అరెస్ట్ చేసి 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు వుంటాయని పోలీసులు హెచ్చరించారు.

# రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు

- గుడివాడలో చైర్‌పర్సన్‌పై దాడికి నిరసనగా ఆందోళన
- వెల్లంపల్లి ఆధ్వర్యంలో ధర్నాకు దిగిన పార్టీ నేతలు

**విజయవాడ:**

కూటమి ప్రభుత్వం బిసి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్. గుడివాడలో జడ్పి చైర్‌పర్సన్ హారికపై దాడికి నిరసనగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసనకు దిగారు వైసిపి శ్రేణులు. నల్ల బ్యాడ్జీలు ధరించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈనిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసిపి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుడివాడలో జరిగిన ఘటనను ఖండించారు వెలంపల్లి. టిడిపి గూండాల అరాచకం రాష్ట్రం మొత్తం చూస్తోందన్నారు. బిసి మహిళ జిల్లా జడ్పి చైర్మన్‌గా ఉండడం మీకు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. ఇంత వ్యవహారం జరగుతుంటే.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారు? హోంమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం బిసి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై హత్యానేరం కింద కేసు పెట్టాలని చెప్పారు. హోంమంత్రిగా అనిత ఉన్నారంటే అది జగన్ దయేనని అన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ విఫలమైందన్నారు. పోలీసులు కూటమి నేతలకు అనుకూలంగా మారడం వలన విధ్వంస పాలన నడుస్తోందన్నారు. పోలీసులు తీరు మార్చుకోకుంటే రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందంటూ హెచ్చరించారు. జడ్పి చైర్ పర్సన్‌కే భద్రత లేకపోతే.. ఇక సామన్య మహిళ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు మేయర్ రాయన భాగ్యలక్ష్మి. బిసి మహిళకు కూటమి నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.





## పోలీస్ శాఖ తరుపున దుర్గమ్మకు ఆషాడం సారే

**భవానీపురం:**

విజయవాడ నగర పోలీస్ శాఖ తరపున కనకదుర్గమ్మకు ఆషాడసారే సమర్పించారు. డప్పు చప్పులు, వేషధారణల నడుమ దుర్గమ్మకు ఆషాడం చీరేసారే తీసుకొచ్చారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆషాడం సారే సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు, ఎడిషనల్ డిసిపి గుణ్ణం రామకృష్ణతో పాటు పలువరు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడితే చిన్నచూపా?

- ఎమ్మెల్యే యార్లగడ్డకు వ్యతిరేకంగా కార్యకర్తల నిరసన
- పార్టీ కోసం కష్టపడ్డ నాయకులను పట్టించుకోవడం లేదని ఆవేదన

**కేసరపల్లి:**

గన్నవరం నియోజకవర్గం టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నారు. కేసరపల్లి వేదికగా తెలుగు తమ్ముళ్లు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వైఖరి మార్చుకోవాలని తెలుగు తమ్ముళ్ల ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకులను పట్టించుకోవడం లేదని.. గెలిచాక కష్టపడ్డ పార్టీ శ్రేణులను దూరం పెడుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ గెలుపుకోసం కృషి చేయడమే మేము చేసిన తప్పా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేని గెలిపిస్తే మా పదవులే పీకేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎమ్మెల్యే పర్యటిస్తూ కనీస సమాచారం ఇవ్వరా? అధినేత చంద్రబాబు ఆదేశాలు కూడా లెక్కచేయరా?. కార్యకర్తలను విస్మరించి ముందుకు సాగాలని చూస్తే అధిష్టానం దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంట్రావ్ తన వైఖరి మార్చుకొని నిజమైన కార్యకర్తకు, పార్టీ కోసం పనిచేసే వారికి ప్రధాన్యత కల్పించాలని కోరారు.



# విద్యార్థులకు అండగా నిలుస్తా

- పింఛన్లు, ఇల్లు మంజూరు చేయిస్తాం
- కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

**కళ్యాణదుర్గం రూరల్:**



ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కళ్యాణదుర్గం నియోకవర్గంలో పర్యటించారు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు. ఆదివారం కళ్యాలదుర్గం రూరల్ మండలం తూర్పు కోడిపల్లి గ్రామంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు, వారికి ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చౌడప్పను పరమార్శించి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.. ఎస్సీ కాలనీలోనే డయాలసిస్ వ్యాధితో మృతి చెందిన వెట్టి మల్లేష్ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు.. ఇటీవలే మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరమార్శించి వారి కుమార్తె వర్షకు ఉచితంగా నర్సింగ్ విద్య అందించేందుకు అనిత కరెస్పాండంట్ అఫ్ కేపీకే అండ్ అద్వైత కాలేజ్ అఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. మరొక అమ్మాయి ఎస్ వనితకు పీవీవీకేకే కళాశాల హాస్టల్ కోసం 25 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వారిరువురికి బట్టలు అన్ని ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తల్లి దండ్రులు ఇద్దరు మృతి చెందడంతో అనాధలుగా మారిన అభి, రేవంత్ లను కళ్యాణదుర్గంలో పాఠశాలతో పాటు హాస్టల్ వసతి ఏర్పాటు చేయించారు.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు పింఛన్లు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఒక్కో ఇంట్లో నలుగురు, ఐదుగురు చదువుతున్న కుటుంబాలకు కూడా తల్లికి వందనం వంద శాతం వచ్చిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాల్లోకి నగదు జమచేయడం జరుగుతుందన్నారు.. సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి వెళుతుంటే ఎమ్మెల్యే, అధికారులతో కలసి తమ ఇంటి దగ్గరికే వచ్చి సమస్యలు తెలుసుకుంటుండడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.. ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తామని తెలిపారు..

# మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె

- జీవో నెం 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్
- అవార్డులు ప్రభుత్వానికి... అర్ధ ఆకలి కార్మికులకా అంటూ ప్రశ్న

**ఇబ్రహీంపట్నం:**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంay మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెకు దిగారు. సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు కొండపల్లి మునిసిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులు. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 29మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెం 36 ప్రకారం వేతానాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికుల వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1300మంది మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ప్రభుత్వానికి చాలీచాలని జీతాలు అర్థ ఆకలి కార్మికులకా? అని ప్రశ్నించారు. కార్మికుల సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అవార్డులు వెనుక మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పాత్ర కీలకం అన్నారు. పట్టణాలు పరిశుభ్రత పాటించడం వల్లే క్లీన్ చేయటం ద్వారా సాధ్యం అయిందని తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు తక్షణమే పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తల్లికి వందనం పథకం పథకం కూడా ఇంజనీరింగ్ కార్మికులకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో ఇంజనీరింగ్ కార్మికులకు ఏ సంక్షేమ పథకం అమలు కావట్లేదు అన్నారు. ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, రేషన్ కార్డులు పిల్లల యాడింగ్ కూడా ఆప్షన్ లేదు అన్నారు. పై సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.






# పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం

- **అన్నమయ్య జిల్లా కలెక్టర్ కీలక నిర్ణయం**
- **ఇకపై ప్రజలు కలెక్టరేట్‌కు రాకుండా.. నేరుగా అర్జీలను వెబ్సైట్‌లో నమోదు**
- **అర్జీ స్టేటస్ కోసం మీకోసం కాల్ సెంటర్ 1100 నెంబర్‌ను సంప్రదించాలని వెల్లడి**

**రాయచోటి :**

ప్రజల సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఇవాళ ఉదయం 10.గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.



# స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు గౌరవప్రదమైన గుర్తింపు

- **అవార్డుకు ఎంపికవడంపై కలెక్టర్ హర్షం**
- **అభివృద్ధి, ప్రజాసేవకు లభించిన గౌరవప్రద గుర్తింపు**

**రాజమండ్రి:**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు మినిస్టీరియల్ అవార్డు (స్టేట్‌లెవల్) కేటగిరీలో ఎంపికై రాష్ట్రస్థాయిలో గౌరవప్రదమైన మంత్రివర్గ పురస్కారాన్ని అందుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈనెల 17న న్యూఢిల్లీలో జరగనున్న అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారని చెప్పారు. అవార్డును స్వీకరించేందుకు కేవలం ముగ్గురు ప్రతినిధులకు మాత్రమే వేదికపైకి అనుమతి ఉంటుందని.. ప్రతినిధి బృందానికి మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి నాయకత్వం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మరియు ఇన్‌చార్జ్ కమిషనర్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పి. ప్రశాంతి స్వయంగా హాజరై పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ ఆర్ ఎమ్ సి కమిషనర్ పి ప్రశాంతి మాట్లాడుతూ "ఈ పురస్కారం రాజమహేంద్రవరం అభివృద్ధిలో కీలక మైలురాయి అని చెప్పారు. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి, ప్రజాసేవా కార్యక్రమాలకు లభించిన గౌరవప్రద గుర్తింపు అని పేర్కొన్నారు.



# శుభ్రతకు నెల్లూరును రోల్ మోడల్‌గా మారుస్తా

- **నెల్లూరులో చిల్డ్రన్స్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు**
- **ముఖ్యతిధిగా పాల్గొన్న రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**
- **చిల్డ్రన్స్ పార్క్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను నాటిన మంత్రి**

**నెల్లూరు :**

నెల్లూరు పట్టణంలో పర్యటించారు రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ. చిల్డ్రన్ పార్క్ నిర్మించి 25 సంపూర్తి చేసుకున్న సందర్భంగా.. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం మంత్రిని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పార్కు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్కులో 25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు. చిల్డ్రన్స్ పార్క్ కి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు మంత్రి నారాయణ. అప్పట్లో మొదటగా నెల్లూరులో గాంధీ పార్క్ ఒక్కటే ఉండేదన్నారు. డంపింగ్ యార్డ్‌ని 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కుగా టిడిపి ప్రభుత్వం మార్చిందన్నారు. జన్మభూమిలో 70 30 కింద జేఎస్ రెడ్డి పార్కును ఏర్పాటు చేసారని.. ఇప్పుడు చిల్డ్రన్స్ పార్క్ ల్యాండ్ మార్కు స్థాయికి ఎదిగిందన్నారు. ఈ పార్కులో 70 మంది పిల్లలు ఒకేసారి ఆడుకొనేలా 28 లక్షలతో ప్లే ఎక్విప్ మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. వర్చూసా డెవలపర్స్ యజమాని వాయుగుండం వెంకటేశ్వర్లు పార్కు అభివృద్ధికి ముందుకొచ్చారని.. ఆధునీకరణకు 40 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారని చెప్పారు మంత్రి నారాయణ. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్ ని పిలిపిస్తానాని హామీ ఇచ్చారు. పార్కు కమిటీతో సమీక్షించి డిజైన్ రూపొందిస్తామన్నారు. 46 పార్కులు నెల్లూరు సిటీలో సిద్ధం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ అవార్డులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రానికి ఐదు అవార్డులు రావటం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాదికి మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. నెల్లూరు సిటీ లో స్వీపింగ్ మిషన్ లతో రోడ్లు శుభ్రం చేస్తున్నామని మరో.. 28 స్వీపింగ్ మిషన్స్ కూడా కార్పొరేషన్ కి కేటాయించామని తెలిపారు. ఎండ్ టు ఎండ్ రోడ్ల పనులు పూర్తి చేసి మిషన్ లతో శుభ్రం చేసే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వాకర్స్ పాల్గొన్నారు .



# శాకాంబరి ఉత్సవాలకు మంత్రి హాజరు

**నిడదవోలు:**

నియోజకవర్గంలోని ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామంలో వేంచేసిన "శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి శాకాంబరీ ఉత్సవాల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులతో చర్చించారు.
మరోవైపు ఆషాడమాస ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ ఆలయంలో శారంబని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ఆలయ అధికారులు. ఆరు టన్నుల కూరగాయలతో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. రైతులను, ప్రజలను కాపాడమని వేడుకున్నారు. ఆషాడమాసం అమ్మవారికి ఇష్టమైన రోజు ఆదివారం కావడంతో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్ అన్నీ భక్తులతో నిండిపోయాయి. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పెన్మత్స విశ్వనాథరాజు పర్యవేక్షణలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# 30 ఏళ్ల తర్వాత ఘనంగా మొహర్రం వేడుకలు

- **పోలీస్ బందోబస్త్ మధ్య వేడుకలు జరుపుకున్న గ్రామస్తులు**
- **వేడుకలకు సహకరించిన పోలీసులకు గ్రామస్తుల కృతజ్ఞతలు**

**అనంతపురం:**

జిల్లా లోని పెద్దవడగూరు మండలం దిమ్మగుడి గ్రామంలో 30 ఏళ్ల తర్వాత మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీసుల చొరవతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు గ్రామస్తులు. చాలా కాలం తర్వాత జరుగున్న వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. 1996లో గ్రామంలో మొహర్రం సందర్భంగా జరిగిన అల్లర్ల కారణంగా.. అప్పటినుంచి దిమ్మగుడిలో మొహర్రం వేడుకలు ఆగిపోయాయి. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన మొహర్రం వేడుకలను తిరిగి జరుపుకునేందుకు గ్రామ పెద్దలు ముందుకొచ్చారు. ఈమేరకు పోలీసులను సంప్రదించారు. తాడిపత్రి ASP దిమ్మగుడి గ్రామాన్ని సందర్శించి గ్రామసభ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామ పెద్దలను బైండ్ ఓవర్ చేశారు. పీర్ల చావిడిలోకి అన్ని కులాల వారికి ప్రవేశం కల్పించారు. గ్రామంలో చిన్న సరిగెత్తు, పెద్దసరిగేత్తు, జలది రోజు పీర్ల ఊరేగింపులో ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్ట్ ఏర్పాటు చేసారు పోలీసులు. 30 సంవత్సరాల తర్వాత గ్రామస్తులు అందరూ ఐకమత్యంగా మొహర్రం జరుపుకున్నందుకు గ్రామస్తులను ASP అభినందించారు.





# మాటల ఎమ్మెల్యే.. చేతల ఎమ్మెల్యే కాదు

- **కడపలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం**
- **స్థానిక ఎమ్మెల్యేపై అంజా భాష ఫైర్**
- **ఏడాది గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదంటూ విమర్శలు**

**కడప:**

కడప స్థానిక ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిపై మాజీ డిప్యూటీ సీఎం, కడప వైసీపీ ఇన్‌చార్జ్ అంజాద్ బాష విమర్శలు చేశారు. కడప ఎమ్మెల్యే మాటలకే పరిమితం అయ్యారు.. అభివృద్ధిలో మాత్రం శూన్యమంటూ ఫైర్ అయ్యారు. ఆదివారం కడపలో నార్త్ జోన్ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న అంజాద్ బాష కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ వైసీపీ అన్నారు. వైసీపీకి కార్యకర్తలే బలం... వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. "ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తి చేసుకుందని, కానీ ఇప్పటివరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకలేదన్నారు. ప్రజలకు మోసం జరిగిందని, కూటమి మాటలు నమ్మి ఓట్లేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కడప శాసనసభ్యురాలుగా గెలిచిన మరుసటి రోజే 10 కార్లలో నగరంలోని రవీంద్రనగర్ కు వెళ్లి షామీర్య, లా కాలేజ్ సమీపంలో బుగ్గవంకపై బ్రిడ్జిలు ఆరు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారని, కానీ ఏడాది దాటుతున్నా ఒక్క ఇటుక కూడా పేర్చలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప ప్రజలు అన్ని విధాలా నష్టపోతున్నారని మండిపడ్డారు. మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన జీవోలు ప్రస్తుతం డేట్లు మార్చి, వాటిని కొత్త జీవోలుగా చూపిస్తున్నారని ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై దృష్టిపెట్టకుండా.. ప్రచారపోకడలతో కాలం గడుపుతున్నారన్నారు. ప్రజల ముందు ఆమె సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు మరచి డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారని, రెడ్ బుక్ రాజ్యాంగంతో అరాచకం సృష్టిస్తున్నారన్నారు. ఈ దాడులకు ఎవరు భయపడటం లేదని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రానున్న ప్రభుత్వం 2.0లో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కడప నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ఈ రాష్ట్రంలో అమలు చేసి చూపిన వారంటే అందరికీ దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిలే గుర్తుకొస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో అండగా నిలిచాయన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం వైసిపి కార్యకర్తలను, నాయకులను అక్రమ కేసులు భనాయించి ఇబ్బందుల గురి చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. చంద్రబాబుకు ప్రజల మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# ప్రేమపై కోర్సు..
## అవును ఉండాల్సిందే..!

ఇంజనీర్, డాక్టర్ లేదా టీచర్ కావడానికీ కోర్సులు ఉంటాయి. మరి ప్రేమించడానికేంటి? ఇది వినడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ వాస్తవానికి చాలా అవసరం. చదువు మనకు ఉద్యోగానికై సిద్ధం చేస్తే, ప్రేమపై కోర్సు మన జీవితానికి సిద్ధం చేస్తుంది. దీన్ని గుర్తించిన ఢిల్లీ యూనివర్సిటీ, విద్యార్థుల కోసం ప్రేమపై ప్రత్యేక సిలబస్‌తో కోర్సు ప్రవేశపెట్టింది. నేటి పరిస్థితిలో, ప్రేమపై గందరగోళంతో జీవిస్తున్న యువతకు ఇది అత్యంత అవసరం.

**ప్రేమ – శాశ్వతమైన శక్తి**

ప్రేమ అనేది సదాకాలికమైన విషయం. ప్రతి ఒక్కరూ దీనిని అనుభవిస్తారు - స్నేహం, కుటుంబం లేదా రొమాన్స్ రూపంలో. ప్రేమ వల్లే బలమైన బంధాలు, దీర్ఘకాలిక పెళ్లిళ్లు ఏర్పడతాయి. ప్రేమ జీవితాన్ని మారుస్తుంది. కానీ దీని గురించి సరిగ్గా అర్థం చేసుకోకపోతే, బాధకీ, నష్టానికీ కారణమవుతుంది. నేటి యువత ప్రేమ అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. భ్రమలే ఎక్కువ, నిజమైన ప్రేమ అర్థం కాకపోవడం వల్ల అస్థిరత, భావోద్వేగ సమస్యలు తలెత్తుతున్నాయి.

**జెన్ Z – కొత్త ప్రేమ పదజాలం**

నేటి ప్రేమకి జెన్ Z తనదైన పదజాలాన్ని కల్పించింది: సిట్యుయేషన్‌షిప్, ఘోస్టింగ్, బెంచింగ్, బ్రెడ్‌క్రంబింగ్ లాంటి పదాలు ఇవాళ్టి ప్రేమలోని భావోద్వేగ రాహిత్యాన్ని సూచిస్తున్నాయి. ప్రేమను శారీరక లేదా ఆర్థిక మార్పిడి వరకు పరిమితం చేస్తున్నారు. భావోద్వేగం, మానసిక అనుబంధం తక్కువైపోతుండటమే యువత ఈ ప్రేమలో విఫలమవడానికీ, బాధపడటానికీ ప్రధాన కారణం.

**ప్రేమ – ఒక శక్తివంతమైన ప్రేరణ**

నిజమైన ప్రేమ ఒక వ్యక్తిని ప్రేరేపించే శక్తిగా మారుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు పోలీస్ ఆఫీసర్ గౌరవాన్ని చూసి ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నాడు. కోచింగ్ సమయంలో కలిసిన యువతితో ఏర్పడ్డ ప్రేమానుభంధం అతనికి భావోద్వేగ మద్దతుగా మారింది. తన ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకొని కష్టపడి విజయాన్ని సాధించి, చివరికి ఆమెను పెళ్లిచేసుకున్నాడు - ఈ కథ 12th ఫెయిల్ చిత్రంగా ప్రేరణనిస్తుంది. మరో వ్యక్తి భార్య జ్ఞాపకార్థంగా కొండను కోసి రోడ్డు వేశాడు. ఇవన్నీ ప్రేమ ఎంతటి శక్తివంతమైన ప్రేరణగా మారుతుందో చూపుతున్నాయి. హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం, ప్రేమతో కూడిన బంధాలు ఉన్నవారు ఎక్కువ ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తారు. కానీ యువత ఈ ప్రేమ శక్తిని కొంతకాలం నెమ్మదిగా నాశనం చేసుకుంటూ తాత్కాలిక అవసరాలకు వాడుతున్నారు.

**అపరిపక్వ ప్రేమ గోతులు**

కళాశాల విద్యార్థులు తక్కువలోపే ప్రలోభాలకు లోనై, పాటలు, బహుమతులతో మొదలై, అవసరాలు తీరిన తర్వాత మోసం చేసే ప్రేమలో పడతారు. దీన్ని లవ్ బాంబింగ్ అంటారు. ఈ తతంగం మనోభంగానికి దారితీస్తుంది. మరో ప్రమాదకర మాయాజాలం క్యాట్‌ఫిషింగ్ - నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇతరులను మోసం చేయడం. 40 సంవత్సరాలపైబడినవారూ దీనికి గురవుతున్నారు. ఇంకా గ్యాస్‌లైటింగ్ అనే మానసిక నియంత్రణ పద్ధతిలో, ఒక వ్యక్తి మరోవారిని భావోద్వేగంగా ఒత్తిడికి గురిచేస్తూ వారిని విడివిడిగా చేస్తారు, అవమానిస్తారు. ఇవన్నీ తెలియకపోవడం వల్లే జీవితాలు నాశనమవుతున్నాయి.

మరి నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

ప్రేమ అనే భావనను మనోవైద్యులు సంవత్సరాలుగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మనిషి ప్రేమలో పడటం వెనుక కారణం ఏంటి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి? లైకింగ్ థియరీ, కలర్ వీల్ థియరీ, అటాచ్‌మెంట్ థియరీ, ట్రయాంగిల్ థియరీ వంటి సిద్ధాంతాలు ప్రేమను వివరిస్తాయి. కానీ ఇవాళ్టి యువత వీటిలో ఏదీ తెలుసుకోలేదు. అందుకే ప్రేమలో పదే పదే తప్పులు చేస్తున్నారు.

**నేటి పరిస్థితుల్లో అవగాహన అవసరం**

డేటింగ్ యాప్స్, డిజిటల్ కమ్యూనికేషన్ పెరిగిన ఈ రోజుల్లో సంబంధాలు మరింత క్లిష్టమయ్యాయి. ఆన్లైన్ స్టాకింగ్, భావోద్వేగ నొక్కులు, తేలికపాటి విడిపోనలు - ఇవన్నీ యువతను వేధిస్తున్నాయి. కానీ ఇలాంటి విషయాలపై మాట్లాడే వేదికలు - ఇంట్లోనూ, కళాశాలలలోనూ - లేవు. దారి తప్పిన నిర్ణయాలు, భావోద్వేగ నష్టాలు - ఇవన్నీ మార్గదర్శనం లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. కోర్ట్ అనే సినిమాలో చూపించినట్లుగా, చట్టాలు చేయడం సరిపోదు - అవి నేర్పించాలి. అదే ప్రేమ విషయంలోనూ వర్తిస్తుంది. ప్రేమ పట్ల హెచ్చరికలు ఇవ్వడం కంటే ప్రేమను ఎలా అర్థం చేసుకోవాలి, పెంపొందించుకోవాలి, విఫలమైన ప్రేమతో ఎలా నెగ్గుకోవాలి, స్వార్థపూరిత సంబంధాలను ఎలా గుర్తించాలో నేర్పాలి.

**ప్రేమను జీవన నైపుణ్యాలుగా నేర్పాలి**

మన పిల్లలకు నడవడం, మాట్లాడటం, తినడం, ఇతరులతో వ్యవహరించడం నేర్పిస్తాం. అలానే ప్రేమించడం నేర్పించకూడదా? ప్రేమపై సరైన అవగాహన ఉండడం వల్ల యువత భావోద్వేగ విపత్తుల నుంచి తప్పించుకోగలుగుతారు. ప్రేమ శక్తిని సానుకూలంగా ఉపయోగించుకొని విజయవంతమైన జీవితం నిర్మించగలుగుతారు. ప్రేమపై ఒక సదుపాయమైన కోర్సు ద్వారా మనం భావోద్వేగ పరిపక్వత గల, బాధ్యతాయుతమైన తరం తయారు చేయగలుగుతాం.



బీ కృష్ణ, సీనియర్ సైకాలజిస్ట్
99854 28261

## ఓ సినిమా క్లాస్ రూమ్‌నే మార్చేసింది..!
# ఆ రాష్ట్రంలో ఇక బ్యాక్ బెంచీలు లేవు..!!





అనగనగా ఓ సినిమా..ఆ సినిమా స్ఫూర్తితో కేరళ రాష్ట్రంలో క్లాస్ రూం స్టైల్ మారిపోయింది. కొల్లం జిల్లాలోని ఆర్.వి.వి సెకండరీ హయ్యర్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్లి క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అక్కడ బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. బెంచీలన్నీ రౌండ్‌గా వేసున్నాయి. పాపినిశ్శేరిలోని స్కూల్, అదూర్‌లోని స్కూల్, తూర్పు మంగడ్‌లోని స్కూల్, పాలక్కాడ్‌లోని స్కూల్... ఈ స్కూళ్లన్నింటిలోనూ విద్యార్థులకు ఇదే ఆశ్చర్యం. కారణం... అక్కడ కూడా క్లాస్‌లలో బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. చుట్టూ వేసి ఉన్నాయి. గత నెల రోజులుగా కేరళలోని ఒక్కోబడి ఒక్కోబడి ఈ మార్పు చేసుకుంటూ వస్తోంది.


**ఈ మార్పుకు కారణం 'శనార్థి శ్రీకుట్టన్' సినిమా**


కేరళ రాష్ట్రంలో ఉన్నట్టుండి అక్కడ తరగతి గదులలో బ్యాక్ బెంచీలన్నీ రౌండ్ బెంచీలవడానికి కారణం రిలీజైనప్పుడు ఎవరూ పట్టించుకోని ఒక సినిమా. నెల క్రితం ఓటీటీలోకి వచ్చాక అందరూ దాన్నే చూస్తున్నారు. ఆ చూసే వారిలో విద్యార్థులు, టీచర్లు, పాఠశాల కరెస్పాండెంట్‌లు, తల్లిదండ్రులు ఉన్నారు... వారందరినీ ఆ సినిమా కదిలించింది. అందుకే వారందరూ క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఉండకూడదని నిశ్చయించుకున్నారు. నిజమే. క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఎందుకు? అంటూ ఆ సినిమా స్ఫూర్తితో క్లాస్ రూమ్ స్టైల్ మార్చేశారు.

సినిమా కథ...క్లుప్తంగా చెప్పాలంటే కె.ఆర్. నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కారెట్టు, తిరువనంతపురం. ఈ పల్లెటూరు స్కూల్లోని ఏడో తరగతి సి సెక్షన్‌లో జరిగే సినిమా కథే 'శనార్థి శ్రీకుట్టన్'. శ్రీకుట్టన్ అనే కుర్రవాడు ఇంట్లోని పరిస్థితుల వల్ల రోజూ స్కూల్‌కి లేట్‌గా వస్తుంటాడు. తను వచ్చేసరికి ముందు బెంచీలన్నీ ఫిల్ అవడం వల్ల తప్పని పరిస్థితుల్లో బ్యాక్‌బెంచ్‌లో కూచుంటుంటాడు. వాడికి ముగ్గురు ఫ్రెండ్స్. వీళ్లంతా అల్లరి గ్యాంగ్ అని క్లాస్‌లో ఫ్రంట్ బెంచ్‌లో కూచునేవారి అభిప్రాయం. నిజానికి ఏ క్లాస్ రూం అయినా లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ పై సహజంగా అందరికీ ఉండే అభిప్రాయం కూడా ఇదే. క్లాస్‌కు వచ్చే ఒక ఉపాధ్యాయుడైతే వీరి మీద పగపడతాడు. వీరు దేనికీ పనికి రారన్నది ఆ స్కూల్ టీచర్ల అభిప్రాయం. ఇక్కడే కథ మలుపు తిరుగుతుంది. శ్రీకుట్టన్ స్కూల్ ఎలక్షన్‌లో నిలబడాలనుకుంటాడు. వీడి మీద పోటీగా ఫ్రంట్ బెంచ్‌లో కూచునే అంబడి అనే కుర్రవాడు నిలబడతాడు. ఎవరు గెలుస్తారు అనేది కథ. క్లాసురూముల్లో వివక్ష ఎన్ని రూపాల్లో ఉంటుంది... వివక్షకు కారణమైన నిర్మాణం ఎలా ఉంటుంది... క్లాస్‌రూమ్‌లోనే వివక్ష పాటించిన విద్యార్థి బయటకు వెళ్లాక పాటించడని గ్యారంటీ ఏమిటీ... పైకి ఇదే కథ అనిపించినా దీనిని ముందు నుంచే మార్చాలి అని దర్శకుడు వినేష్ విశ్వనాథ్ చెప్పదలుచుకున్నాడు...చాలా బాగా చెప్పాడు.

**1996లో కేంద్రం చెప్పినా...**

క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల సీటింగ్ వారిలో వివక్షకు కారణం కాకూడదని, పిల్లల తెలివితేటలు... ఆర్థిక స్థితి... ప్రవర్తనను ఆధారంగా ముందు బెంచీలకు కొందరిని, వెనుక బెంచీలకు కొందరిని పరిమితం చేయకూడదని 1996లో కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. అయితే ఆ మార్పులను ఎవరూ పట్టించుకోలేదు. మన దేశంలో స్కూళ్లు మొదలైనప్పటి నుంచి 'మొద్దు'లుగా భావించే పిల్లలను వెనుక కూచోబెట్టడం టీచర్లకు అలవాటైపోయింది. వెనుక కూచుని వెనుకబడితే మళ్లీ వారిదే తప్పుగా నిలబెట్టడం కూడా ఆనవాయితీనే. విద్యార్థిగా పొందే గౌరవం వెనుక బెంచీ విద్యార్థులకు చాలామందికి ఉండదు. ఈ పరిస్థితి మారాలని ఒక వెనుకబెంచీ కుర్రాడిని హీరోగా చేసి అతనిలోని తెలివితేటలను, చురుకుదనాన్ని చూపుతూ నిరూపించాడు దర్శకుడు ఈ సినిమాలో. అందుకే అది కేరళ బడుల్లో కదలిక తెచ్చింది. ఇక దేశం మొత్తం ఇలాంటి సినిమాలో ఆలోచనలు వచ్చి మార్పు తేవాల్సి ఉంటుంది. మార్పు మంచిదైతే అందరికీ మంచే కదా?





# నబా చిరుత మృతిపై పలు అనుమానాలు

**టీపీఎన్, కునో నేషనల్ పార్క్ :**

భారత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్ చీతా కింద నమీబియా నుంచి కునో నేషనల్ పార్కుకు తీసుకువచ్చిన ఎనిమిదేళ్ల ఆడ చిరుత తీవ్ర గాయాలతో చనిపోయింది. వేటాడే ప్రయత్నంలో తీవ్రగాయాలైన వారం తర్వాత చనిపోయిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చికిత్స పొందినప్పటికి కోలుకోలేక పోయిందని చీతా ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ఉత్తమ్ శర్మ అన్నారు. నమీబియా నుంచి తీసుకువచ్చిన చిరుతల్లో నబా ఒకటి. రెండు దశల్లో కునో నేషనల్ పార్కుకు విదేశాల నుంచి చిరుతలను తీసుకువచ్చారు. మొదటి బ్యాచ్ 2022 సెప్టెంబర్ లో రెండవ బ్యాచ్ ఫిబ్రవరి 2023లో దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చారు. వీర , నిర్వా అనే రెండు ఆడ చిరుతలు కూడా ఇటీవలే పిల్లలకు జన్మనిచ్చాయి. నభా మరణానికి ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోస్ట్‌మార్టం నివేదిక కోసం వెయిట్ చేస్తున్నారు అధికారులు.



# నవీన్ పట్నాయక్‌కు ఘన స్వాగతం పలికిన బీజేడీ

**టీపీఎన్, ,భువనేశ్వర్ :**

బిజు జనతాదళ్ (బిజెడి) పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ఒడిశా రాజధానికి తిరిగి వచ్చారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో ముంబైలో శస్త్రచికిత్స చేసుకుని ఒడిశాకు తిరిగి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది పార్టీ కార్యకర్తలు బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం , పట్నాయక్ నివాసానికి భారీగా తరలివచ్చారు. నవీన్ పట్నాయక్ ఇంటికి వెళ్లే మార్గంలో ఆయనకు దారిపొడవునా ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అయిన పట్నాయక్ జూన్ 22న ముంబైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. సోమవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఒడిశాకు తిరిగి రావడానికి ముందు ఒక వారం పాటు మందులు తీసుకున్నాడు. బిజెడి అధినేతకు స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు సహా పలువురు బిజెడి నాయకులు విమానాశ్రయంకు చేరుకున్నారు. ఒడిశాను అభివృద్ధి పథంలో నడిపించిన నవీన్ పట్నాయక్ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమను ఈ జనసమూహామే నిదర్శనంగా నిలుస్తుంది.



# వచ్చేవారం చైనా పర్యటనకు జై శంకర్

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

LAC ప్రతిష్టంభన తర్వాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్ తొలిసారి వచ్చే వారం చైనాను సందర్శించనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం ఈనెల 15న టియాంజిన్‌లో జరుగుతుంది. ఈ సమావేశానికి జైశంకర్ హాజరుకానున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ SCO రక్షణ మంత్రుల శిఖరాగ్ర సమావేశానికి చైనాను సందర్శించిన దాదాపు రెండు వారాల తర్వాత, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వచ్చే వారం షాంఘై సహకార సంస్థ (SCO) విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి చైనాలోని టియాంజిన్‌కు వెళ్లనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం జూలై 15న టియాంజిన్‌లో జరుగుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు, వార్తా సంస్థ PTI నివేదించింది ."వివిధ రంగాల్లో SCO సహకారం, అంతర్జాతీయ , ప్రాంతీయ సమస్యలపై అభిప్రాయాలను పంచుకుంటారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.



# పార్లమెంట్ వర్షా కాల సమావేశాలపై కాంగ్రెస్ కసరత్తు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహాలను రచిస్తోంది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షత కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు..పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. బీహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేపట్టడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తాయని భావిస్తున్నారు. అలాగే, పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన దౌత్యపరమైన చర్యలపై చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది, ఇది ముందుగా అనుకున్న దానికంటే ఒక వారం ఎక్కువ సమయం.కాంగ్రెస్ వ్యూహాన్ని ఖరారు చేయడానికి సోనియా గాంధీ అధ్యక్షతన ఈనెల 15న సమావేశం కానున్నారు.

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడిపై చర్చకు ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అణు యుద్ధాన్ని నివారించడానికి భారతదేశంపాకిస్తాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరుతున్నాయి. గత నెలలో జరిగిన ఫోన్ కాల్‌లో, భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులో కూడా దానిని అంగీకరించదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్రంప్ వాదనలను ప్రభుత్వం తిరస్కరించింది.

# ఛత్తీస్‌గఢ్‌లో 23 మంది మావోయిస్టులు లొంగుబాటు

**టీపీఎన్, సుక్మా :**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో 23 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. సరెండర్ అయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు , మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్ కూడా ఉన్నారు. వీరికి రూ.1.18 కోట్ల నజరానా ప్రకటించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) సాయుధ విభాగమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) యొక్క బలీయమైన బెటాలియన్ 1 నుండి ఎనిమిది మంది కఠినమైన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. లొంగిపోయిన వారిలో లోకేష్ అలియాస్ పొడియం భీమ (35) అనే డివిజనల్ కమిటీ సభ్యుడు (DVCM) కూడా ఉన్నాడు. 2007 నుండి, అతను బస్తర్ ప్రాంతంలో కనీసం తొమ్మిది దాడుల కేసుల్లో పాల్గొన్నాడు, దీనివల్ల అనేక మంది భద్రతా సిబ్బంది మరణించారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ అన్నారు. లొంగిపోయిన మరో మావోయిస్టును రమేష్ అలియాస్ కల్ము (35)గా గుర్తించారు, ఇతను మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్. ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.8 లక్షల బహుమతి ఉంది. 2024 నుంచి నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం అయిన తర్వాత, 1,450 మందికి పైగా మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. వీటి వెనుక అనేక అంశాలు ఉన్నాయని చవాన్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు కూడా గిరిజనులపై జరిగిన హింసను ఇష్టపడలేదని చవాన్ అన్నారు. ప్రతి మావోయిస్టుకు లొంగిపోయిన మొత్తంగా రూ. 50,000 ఇవ్వడంతో పాటు నైపుణ్య శిక్షణ కూడా పొందుతారు.



# వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగావకాశాలు

**టీపీఎన్, బీహార్ :**

ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రజలకు వరాల జల్లు కురిపిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చే రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జననాయక్ కర్పురి ఠాకూర్ నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలకు, కోటి మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు , ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా 202025 లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.. దీనిని సాధించడానికి, ప్రైవేట్ రంగంలో, ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయి. దీని కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని.. ప్రైవేట్ రంగంలో దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తంగా 50 లక్షల మందికి పైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు..ఉపాధి కల్పించామనే చెప్పడానికి తాను గర్వంగా ఫీలవుతున్నాయని చెప్పారు. 2005 నుంచి 2020 మధ్య బీహార్‌లోని 8 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని నితీష్ కుమార్ పేర్కొన్నారు.





# తమిళనాడులో గూడ్స్ రైలులో మంటలు

**టీపీఎన్, తిరువళ్లూరు :**

తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం జరిగింది. తిరువల్లూరులోని చెన్నైఅరక్కోణం మార్గంలో ఓ గూడ్స్‌రైలు భారీ ప్రమాదానికి గురైంది. డీజిల్ ట్యాంకరుతో వెళ్తున్న రైలుకు మంటలు అంటుకున్నాయి. మొత్తం నాలుగు వ్యాగన్లు మంటల్లో చిక్కుకున్నాయి. నల్లని దట్టమైన పొగలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. గూడ్స్ రైలులో పెద్ద ఎత్తున ఇంధనం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు చెన్నైఅరక్కోణం మార్గంలో అన్ని రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు, నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



## దలైలామా వారసుడి ఎంపికపై చైనా ఆగ్రహం ఎందుకు?

దలైలామా వారసుడి అంశాన్ని భారత దేశం , చైనా మధ్య సంబంధాలలో ఒక ముల్లులా అభివర్ణించారు చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి. దలైలామా పునర్జన్మ గురించి కొంతమంది భారతీయ నిపుణులు, విద్యావేత్తలు తప్పుడు ప్రకటనలు చేశారని అన్నారు. టిబెటన్ బౌద్ధుల ఆధ్యాత్మిక నాయకుడు దలైలామా తన 90వ పుట్టినరోజును హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలోని సుగ్లఖాంగ్ ఆలయ సముదాయంలో బౌద్ధ సమాజ ప్రజల మధ్య జరుపుకున్నారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్, అరుణాచల్ సీఎం పెమా ఖండు, సిక్కిం మంత్రి సోనమ్ లామా ఈ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. దలైలామా పుట్టినరోజు సందర్భంగా భారత ప్రభుత్వ ప్రతినిధులు అక్కడ ఉండటంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దలైలామా వారసుడి అంశం చైనా, భారతదేశం మధ్య సంబంధాలలో అడ్డంకిగా ఉందని ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయం ఆదివారం అభివర్ణించింది. 2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత విదేశాంగ మంత్రి తొలిసారిగా చైనాను సందర్శించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. తన వారసుడిని ఎన్నుకోవడంలో చైనాకు ఎటువంటి పాత్ర ఉండదని తన పుట్టినరోజు సందర్భంగా దలైలామా స్పష్టం చేశారు. మరో 30 నుంచి 40 సంవత్సరాలు జీవించాలనే కోరికను ఆయన వ్యక్తం చేశారు. ఒక గొప్ప సన్యాసి మరణించినప్పుడు, అతని ఆత్మ మరొకరిలో పునర్జన్మ పొందుతుందని టిబెటన్లు నమ్ముతారు. కానీ దలైలామా తదుపరి వారసుడిని తమ నాయకుల ఆమోదంతో మాత్రమే నిర్ణయిస్తామని చైనా చెబుతోంది.దలైలామా 1959లో చైనా పరిపాలనా టిబెట్ నుండి పారిపోయి భారతదేశంలో ఆశ్రయం పొందారు. అప్పటి నుండి, ఆయన భారతదేశంలో నివసిస్తున్నారు. చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన స్వరాన్ని వినిపిస్తున్నారు. భారతదేశంలో సుమారు 70 వేల మంది టిబెటన్ శరణార్థులు నివసిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో ఓ వ్యాపారి దారుణ హత్య




**టీపీఎన్, ఢాకా :**

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఓ హిందూ వ్యాపారవేత్తను కాంక్రీట్ స్లాబ్‌తో కొట్టి చంపారు దుండగులు. అనంతరం మృత దేహంపై నృత్యం చేస్తున్నవీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా భారీగా నిరసనలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. లాల్ చంద్ సోదరి మంజురా బేగం కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు పోలీసులు. ఇందులో 19 మంది నిందితులతో పాటు 15 నుంచి 20 మంది గుర్తుతెలియని వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. పోలీసులు ఇప్పటివరకు 5 మందిని అరెస్టు చేశారు, వీరిలో ఇద్దరు అక్రమ ఆయుధాలను కలిగి ఉన్నట్లు కూడా గుర్తించారు.

# అమెరికా, జపాన్, దక్షిణకొరియాలకు రష్యా వార్నింగ్

- **ఉత్తరకొరియా జోలికి వస్తే చూస్తూ ఊరుకోం**



ఉత్తర కొరియాను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలను రష్యా హెచ్చరించింది. ఉత్తర కొరియా అణు కార్యక్రమానికి ప్రతిస్పందనగా అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా తమ త్రైపాక్షిక సైనిక విన్యాసాలను ముమ్మరం చేసిన సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం మూడు దేశాలు కొరియా ద్వీపకల్పం సమీపంలో ఉమ్మడి వైమానిక విన్యాసాలు నిర్వహించాయి. దీనిలో అణ్వాయుధాలను మోసుకెళ్లగల అమెరికన్ బాంబర్లు కూడా పాల్గొన్నాయి. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ శనివారం తూర్పు ఉత్తర కొరియా నగరమైన వోన్సాన్‌లో అమెరికా నేతృత్వంలోని భద్రతా కూటమికి వ్యతిరేకంగా తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ఎటువంటి సైనిక కూటమికి దూరంగా ఉండాలని అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లకు లావ్‌రోవ్ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌ను కలిసిన తర్వాత ఆయన ప్రకటన వెలువడింది. ఉత్తర కొరియా లేదా రష్యాకు వ్యతిరేకంగా కూటమిని నిర్మించడానికి ఉపయోగించకూడదని ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో సన్ హుయ్‌తో చర్చల తర్వాత లావ్‌రోవ్ విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఉత్తర కొరియా ఈ సైనిక విన్యాసాలను దాడికి సన్నాహకంగా భావిస్తోంది. అందుకే అది తన అణ్వాయుధాలను ఆత్మరక్షణ సాధనంగా అభివర్ణిస్తోంది. ఈ విషయంపై లావ్రోవ్ మాట్లాడుతూ ఉత్తర కొరియా అణు కార్యక్రమం దాని శాస్త్రవేత్తల కృషి ఫలితమే. వారి అణు అభివృద్ధి వెనుక గల కారణాలను మేము అర్థం చేసుకున్నామని.. గౌరవిస్తామని అన్నారు.ఈ సమావేశంలో, ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు తమ దేశం బేషరతుగా మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. రష్యాలోని కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలో ఉక్రెయిన్ చొరబాట్లను ఆపడంలో ఉత్తర కొరియా దళాల సహకారానికి లావ్రోవ్ కృతజ్ఞతలు తెలిపారు.గత సంవత్సరాల్లో ఉత్తర కొరియా , రష్యా మధ్య సైనిక , ఆర్థిక సహకారం మరింతగా పెరిగింది. ఉత్తర కొరియా రష్యాకు ఆయుధాలు , మందుగుండు సామగ్రిని అందిస్తుంది, అయితే రష్యా సైనిక సాంకేతికత, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. దీని వలన రష్యా ఉత్తర కొరియాకు అటువంటి సున్నితమైన సాంకేతికతను అందించవచ్చని, ఇది దాని అణు , క్షిపణి కార్యక్రమాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తుందని అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా ఆందోళన వ్యక్తం చేశాయి.లావ్రోవ్ పర్యటన వోన్సాన్ నగరంలో జరిగింది, అక్కడ ఉత్తర కొరియా ఇటీవల 20,000 మందికి వసతి కల్పించగల ఒక గొప్ప సముద్ర రిసార్ట్‌ను ప్రారంభించింది. రష్యన్ పర్యాటకులు ఇక్కడికి రావాలని కోరుకుంటారని నాకు ఖచ్చితంగా తెలుసు. విమాన ప్రయాణంతో సహా వారిని ఇక్కడికి తీసుకురావడానికి మేము సాధ్యమైన ప్రతి సౌకర్యాన్ని అందిస్తామని సమావేశం ప్రారంభంలో లావ్రోవ్ అన్నారు.ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ తన శిథిలావస్థలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పర్యాటకం ద్వారా పునరుద్ధరించాలనే ప్రణాళికలో వోన్సాన్‌కల్మా పర్యాటకం అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. అయితే, ఉత్తర కొరియా తన సరిహద్దులను ఎప్పుడు పూర్తిగా తెరుస్తుందో, పాశ్చాత్య పర్యాటకులను స్వాగతిస్తుందో ఇంకా స్పష్టంగా తెలియలేదు.

# శాంతియుత ప్రయోజనాల కోసం మా అణు కార్యక్రమం

**టీపీఎన్, పాకిస్తాన్ :**

భారత్ ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో అణు ఉద్రిక్తతలు దారితీశాయని.. పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలపై ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. అవన్నీ అసత్య ప్రచారమేనని కొట్టిపారేశారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి "అణు బ్లాక్‌మెయిల్" కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది.ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.





### శత్రువు రక్షణ వ్యవస్థను

# నాశనం చేసే ఆయుధం

- **2030 లో భారత సైన్యంలోకి పినాకా-4**

భారతదేశ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (DRDO) తదుపరి తరం గైడెడ్ రాకెట్ వ్యవస్థ పినాకా4 ను అభివృద్ధి చేస్తోంది. దీని పరిధి 300 కిలోమీటర్లు ఉంటుంది. పినాకా 4 యొక్క పరీక్షలు 2028 లో ప్రారంభమవుతాయి. దీనిని 2030 లో భారత సైన్యంలోకి చేర్చనున్నారు. ఈ వ్యవస్థ DRDO యొక్క ప్రలే షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ క్షిపణి (SRBM) నుండి ప్రేరణ పొందిన శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోవడానికి అధునాతన లక్షణాలను కలిగి ఉంటుంది.

పినాకా4 అనేది ఒక విప్లవాత్మక అడుగు. ఇది దాని లక్ష్య పరిధిని 300 కి.మీ.లకు విస్తరిస్తుంది. ఇది వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణులకు చౌకైన , మరింత ఖచ్చితమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది. DRDO యొక్క ఆయుధ పరిశోధన అభివృద్ధి స్థాపన (ARDE) , సోలార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ పరిశ్రమ భాగస్వాముల సహకారంతో అభివృద్ధి చేయబడిన పినాకా 4, కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్‌లు , శత్రు కోటల లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులు చేస్తోంది.

**పినాకా-4 యొక్క లక్షణాలు**

పినాకా4 యొక్క 300 mm క్యాలిబర్, మునుపటి 214 mm వెర్షన్ల కంటే పెద్దది. ఇది ఎక్కువ ప్రొపెల్లెంట్ లోడ్‌ను 250 కిలోల వార్‌హెడ్‌ను మోయగల సామర్థ్యాన్ని ఇస్తుంది. దీని విధ్వంసక శక్తిని పెంచుతుంది.

**అధునాతన మార్గదర్శక వ్యవస్థ**

DRDO యొక్క రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (RCI) అభివృద్ధి చేసిన గైడెన్స్, నావిగేషన్ కంట్రోల్ (GNC) వ్యవస్థ 10 మీటర్ల కంటే తక్కువ వృత్తాకార దోష సంభావ్యత (CEP) తో ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుంది, ఇది చైనా యొక్క PHL16 , రష్యా యొక్క స్మెర్చ్ MBRL వంటి వ్యవస్థలతో పోటీ పడుతోంది.

**వాయు రక్షణను తప్పించుకునే సామర్థ్యం**

పినాకా4 యొక్క అతి ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ఇది శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలదు. ఇది 150-500 కిలోమీటర్ల పరిధి .. క్వాసీబాలిస్టిక్ పథంతో, మానియోవెలబుల్ రీఎంట్రీ వెహికల్ (MaRV), జెట్ వేన్‌ల ద్వారా థ్రస్ట్ వెక్టర్ నియంత్రణ , డెకాయ్ డిప్లాయ్‌మెంట్‌ను ఉపయోగిస్తుంది. పినాకా4 రాడార్ గుర్తింపు , అంతరాయాన్ని ఎదుర్కోవడానికి మిడ్‌కోర్స్ యుక్తి, ఫ్లాట్ ఫ్లైట్ పథం , అధునాతన ఎలక్ట్రానిక్ కౌంటర్మెజర్స్ (ECCM) కలిగి ఉంటుంది.

**ప్రాంతీయ సవాళ్లు**

పినాకా4 ను చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ (PLARF) నుండి వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేశారు, ఈ రాకెట్ ఫోర్స్ PHL16 (250-500 కి.మీ పరిధి) వంటి వ్యవస్థలను నిర్వహిస్తుంది. 300 కి.మీ వేరియంట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా, DRDO చైనా రాకెట్ ఫిరంగిదళంలోని సంఖ్యలు, శ్రేణి ప్రయోజనాన్ని ఎదుర్కోవడం లక్ష్యంగా పెట్టుకుంది.




## టాటా ఎలక్ట్రిక్ కార్లపై బంపర్ ఆఫర్

ఇండియాలో కార్ల వినియోగం బాగా పెరిగింది. పెట్రోల్ అలాగే డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో... చాలామంది ఎలక్ట్రిక్ వాహనాలకు మొగ్గు చూపుతున్నారు. దీనికి తగ్గట్టుగానే కంపెనీలు రకరకాల కార్లను లాంచ్ చేస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో టాటా మోటార్స్ అదిరిపోయే శుభ వార్త చెప్పింది. తమ ఎలక్ట్రిక్ కార్ల పై డిస్కౌంట్ ప్రకటించింది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం.. 15% సేల్స్ తగ్గాయని.. ఈసారి డిస్కౌంట్ ప్రకటించింది. ఇందులో భాగంగానే హారియర్ ఎలక్ట్రిక్ కారుపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ అందించేందుకు సిద్ధమైంది. అయితే ఇందులో కొన్ని మోడల్స్ పైనే ఈ ఆఫర్ ఉంది. కొన్ని నగరాలకు మాత్రమే ఈ ఆఫర్లు పరిమితం చేసింది. అదే సమయంలో టాటా టియాగో ఎలక్ట్రిక్ కారు లాంగ్ రేంజ్ మోడల్ పైన 40,000 వరకు డిస్కౌంట్ అందిస్తున్నారు.

వినియోగదారులు తమ పాత కారును అమ్మేస్తే 20,000 డిస్కౌంట్ కూడా ఇవ్వనున్నారు. ఎక్స్ఛేంజ్ బోనస్ కింద 20,000 పొందే అవకాశాలు ఉన్నట్లు ప్రకటన చేసింది. టాటా నెక్సన్ EV పైన 30 వేల ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నారు. అదనంగా ఆరు నెలల పాటు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్ లో 1000 యూనిట్ల ఉచిత చార్జింగ్ కూడా ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. టాటా కరువు ఎలక్ట్రానిక్ కారుపై... 50 వేల వరకు ఎక్స్ఛేంజి బోనస్ కూడా అందిస్తున్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజుల వరకు మాత్రమే ఉంటుందని ప్రకటన చేశారు.

## ముంబైలో టెస్లా షోరూం ప్రారంభం




**టీపీఎన్, ముంబై :**

టెస్లాకార్లు భారత్ రోడ్లపై పరుగులు పెట్టేందుకు రెడీ అయ్యాయి. అంతర్జాతీయ ఈవీ కార్ల దిగ్గజం టెస్లా..భారత్‌లో అడుగుపెట్టబోతున్నది. దేశంలో తన తొలి షోరూంను వచ్చేవారంలో ప్రారంభించబోతున్నట్టు తెలుస్తున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నెలకొల్పిన తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఈ నెల 15న ప్రారంభించబోతున్నది. ఎలాన్ మస్క్ నాయకత్వంలో నడుస్తున్న టెస్లా..ఈ షోరూం ప్రారంభోత్సవానికి ఎంపిక చేసిన వ్యక్తులకు మాత్రమే ఆహ్వానాలు పంపింది.

# ఆచితూచి అడుగు వేయండి

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్‌మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించొచ్చు. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం వంటివి సూచీల గమనాన్ని నిర్దేశిస్తాయి. చివరి స్వింగ్ హై నుంచి 9 సెషన్లలో నిఫ్టీ దాదాపుగా 587 పాయింట్లే మేర పతనమైంది. 25,000 పైన సూచీకి బలమైన మద్దతు ఉంది. ఇప్పటికే స్వల్పకాలంలో ఎక్కువగా పతనమవ్వడం, కొనుగోళ్ల మద్దతు దొరికితే మళ్లీ బుల్ రంకెల్ వేయొచ్చు. ప్రస్తుతం ఎఫ్‌ఎంసీజీ, ఎంఎన్‌సీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు బలంగా ఉన్నాయి. ఐటీ, మీడియా, కన్జూమర్ డ్యురబుల్స్, మెటల్, ఆటో షేర్లలో స్వల్పకాల బలహీనత కనిపిస్తోంది.




**స్టాక్ రికమెండేషన్స్**

ఎస్బీఐ లైఫ్: 52వారాల కనిష్ఠం నుంచి 33 శాతం మేర ఎగిసిన ఈ షేర్లు ప్రస్తుతం 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకేందుకు సిద్ధమవుతున్నాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బలంగా ఉన్నాయి. చివరి 3 నెలల్లో ఈ కౌంటర్ 23 శాతం మేర రాబడి అందించింది. గత శుక్రవారం రూ.1835 వద్ద ముగిసిన ఇందులో ఇన్వెస్టర్లు రూ.1950 టార్గెట్ ధరతో రూ.1800 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.1740 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**కొటక్ బ్యాంకు:**

సుదీర్ఘకాలం సైడ్‌వేస్‌లో చలించిన ఈ షేర్లు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాన్ని తాకేందుకు దూకుడు కనబరుస్తున్నాయి. బేస్ పైన బేస్ ఏర్పడటం సానుకూల అంశం. దీనిని బ్రేకౌట్ చేసేందుకు రెడీగా ఉంది. బ్యాంకింగ్ రంగానికి మూమెంటమ్ రాగానే ఇది మెరుగైన రాబడి ఇవ్వొచ్చు. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం రూ.2220 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.2320 టార్గెట్ ధరతో రూ.2200 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.2150 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.

**జైడస్ లైఫ్:**

కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండులో కొనసాగిన ఈ షేర్లు ప్రస్తుతం రివర్సల్ అవుతున్నాయి. హయ్యర్ లోస్ ఫామ్ చేస్తూ 52వారాల కనిష్ఠం నుంచి 23శాతం మేర ఎగిసింది. గత శుక్రవారం నాటి నష్టాల మార్కెట్లోనూ ఈ షేర్లు 0.68% మేర లాభపడి 979 వద్ద ముగిశాయి. ఇన్వెస్టర్లు రూ.1050 టార్గెట్ ధరతో రూ.960 శ్రేణిలో ఈ కౌంటర్లో ప్రవేశించాలి. రూ.910 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**జేఎస్‌డబ్ల్యూ ఇన్ఫ్రా:**

జీవితకాల గరిష్ఠం తర్వాత 40% మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేర్లు ప్రస్తుతం దూకుడు కనబరుస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రివరల్స్ మొదలైనప్పటి నుంచి మంచి రాబడి అందిస్తున్నాయి. ప్రస్తుతం ఇందులో ఒడుదొడుకులు తగ్గాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.317 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.385 టార్గెట్ ధరతో రూ.310 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.300 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

**ఎటర్నల్:**

52వారాల కనిష్ఠం నుంచి 5% ఎగిసిన ఈ షేర్లు ప్రస్తుతం స్వల వ్యవధి బ్రేకౌట్‌కు రెడీ అయ్యాయి. గత శుక్రవారం నాటి పతనంలో ఈ షేర్లు తట్టుకొని లాభాల్లోముగిశాయి. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. రేంజ్ కాంట్రాక్షన్ కనిపిస్తోంది. ప్రస్తుతం రూ.263 వద్ద చలిస్తున్న ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.290 టార్గెట్ ధరతో రూ.260 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.250 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.


మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

# 2026లో భారత్ వాణిజ్య లోటు $300 బిలియన్లు : ICICI బ్యాంక్ నివేదిక

**టీపీఎన్, ముంబై :**

ICICI బ్యాంక్ తాజా అంచనాల ప్రకారం, 202526 ఆర్థిక సంవత్సరంలో భారత్ వాణిజ్య లోటు $300 బిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. ఇది గత సంవత్సరాలతో పోలిస్తే మరింత పెరుగుదల. 202425లో వాణిజ్య లోటు $287 బిలియన్లు కాగా, 202324లో ఇది $245 బిలియన్లు. తాజా అంచనాల ప్రకారం, ఇది **జీడీపీలో సుమారు 7%**ను సూచిస్తుంది.

బ్యాంక్ తెలిపిన ప్రకారం, వాణిజ్య లోటు పెరుగుతున్న ప్రధాన కారణం నాన్‌ఆయిల్ ఎగుమతుల బలహీనత. ఇవి వేగంగా పెరుగుతున్న దిగుమతులతో పోలిస్తే సరిపడలేకపోతున్నాయి. అంతేకాక, బలమైన దేశీయ ఆర్థిక వృద్ధి కారణంగా దిగుమతుల పరిమాణం పెరుగుతుంది, దీని వలన ఎగుమతులుదిగుమతుల మధ్య తేడా మరింత విస్తరిస్తోంది.



అయితే, ఈ లోటుతోపాటు ఒక సానుకూల అంశం కూడా ఉంది. సర్వీసుల ఎగుమతులు మరియు ప్రవాస భారతీయుల రెమిటెన్సులు వంటి స్థిరమైన ఆదాయాలు, కరెంట్ అకౌంట్ లోటును (CAD) **జీడీపీలో 0.7% (దాదాపు $30 బిలియన్లు)**గా నియంత్రించగలవని ICICI అంచనా వేస్తోంది. కరెంట్ అకౌంట్ లోటులో వాణిజ్య లోటుతో పాటు పెట్టుబడి ఆదాయాలు, రెమిటెన్సులు వంటి ఇతర విదేశీ ఆదాయాలు కూడా ప్రభావం చూపుతాయి.

వాణిజ్య లోటు అంటే, దేశం దిగుమతి చేసుకునే వస్తువుల విలువ, ఎగుమతుల విలువ కంటే అధికంగా ఉన్నప్పుడు ఏర్పడే పరిస్థితి. భారత్‌లో ఇది ఒక పదేపదే ఎదురయ్యే సమస్యగా మారింది. ముఖ్యంగా చమురు రంగం తప్ప మిగిలిన రంగాల్లో ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో, నాన్‌ఆయిల్ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం ద్వారా **దేశం మొత్తం బహిరంగ ఆర్థిక స్థిరత్వం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్)**ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఈ వాణిజ్య అసమతుల్యతలను సమర్థవంతంగా ఎదుర్కోవడం చాలా కీలకమని హెచ్చరించింది.

# సానుకూల గ్లోబల్ సంకేతాలతో భారత స్టాక్ మార్కెట్ స్థిర ప్రారంభం..!



**టీపీఎన్, ముంబై :**

సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, అలాగే PSU బ్యాంకులు మరియు ఐటీ రంగాల్లో ప్రారంభంలో ఉన్న కొనుగోళ్ల ఆసక్తి కారణంగా, భారత స్టాక్ మార్కెట్ సోమవారం స్థిరంగా ప్రారంభమైంది. ఉదయం 9:27 IST సమయంలో, BSE సెన్సెక్స్ స్వల్పంగా 1.35 పాయింట్లు పెరిగి 84,057.55 వద్ద ట్రేడవుతుండగా, NSE నిఫ్టీ కూడా 6.50 పాయింట్లు లేదా 0.03% పెరిగి 25,644.30 వద్ద కొనసాగింది. నిఫ్టీ బ్యాంక్ 15.15 పాయింట్ల లాభంతో 57,459.05 వద్ద కొనసాగింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతుండడం, అలాగే బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు $67కి పడిపోవడం వంటి అంశాలు మార్కెట్ మనోభావాలకు మద్దతు ఇవ్వడంలో కీలకంగా నిలిచాయి. అమెరికాచైనా, అమెరికాభారత్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూలత కనబడుతున్నట్టు వచ్చిన నివేదికలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్నాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ, గత రెండు వారాల మార్కెట్ ర్యాలీలకు HDFC బ్యాంక్, ICICI బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ & టౌబ్రో వంటి లార్జ్ క్యాప్ స్టాక్స్ ప్రధాన కారణమని తెలిపారు. ఇవి బలమైన సంస్థాగత కొనుగోళ్లకు కేంద్రంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

**మిడ్క్యాప్ మరియు స్మాల్‌క్యాప్ స్టాక్‌లు కూడా లాభాలు నమోదు చేశాయి.**

- నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 220.90 పాయింట్లు (0.37%) పెరిగి 59,606.05 వద్దకు చేరింది.
- నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 153.35 పాయింట్లు (0.81%) పెరిగి 19,130.15 వద్ద స్థిరపడింది.

**సెన్సెక్స్‌లో నష్టపోయిన టాప్ షేర్లు:**

- M&M
- కోటక్ మహీంద్రా బ్యాంక్
- భారతి ఎయిర్‌టెల్
- HDFC బ్యాంక్
- NTPC
- అల్ట్రాటెక్ సిమెంట్


**లాభాల్లో కొనసాగిన షేర్లు:**

- ట్రెంట్
- SBI
- లార్సెన్ & టౌబ్రో
- ఆక్సిస్ బ్యాంక్
- హిందుస్తాన్ యూనిలీవర్

డాలర్ ఇండెక్స్ బలహీనత విదేశీ పెట్టుబడిదారులకు లాభదాయకంగా మారింది. రిటైల్ పెట్టుబడిదారుల్లో కొనసాగుతున్న ఆశావాదం దేశీయ పెట్టుబడుల ప్రవాహాన్ని సమర్థిస్తోంది. నిపుణుల సూచన ప్రకారం, ప్రస్తుత బుల్లిష్ మార్కెట్ ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి కొనసాగించడం సమంజసం. అయితే, మార్కెట్ ఇప్పటికే ఎక్కువగా విలువపడినందున కొత్త పెట్టుబడులు చేపడుతున్నప్పుడు జాగ్రత్త అవసరమని హెచ్చరిస్తున్నారు.

**జూన్ 27న:**

- విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) ₹1,397.02 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు.
- దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹588.93 కోట్ల విలువైన షేర్లను విక్రయించి నికర విక్రేతలుగా నిలిచారు.



# దేశంలో కొత్త బ్యాంకులు?

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

దేశంలో కొత్త బ్యాంకులు రాబోతున్నాయి. దశాబ్దకాలం తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మళ్లీ బ్యాంకింగ్ లైసెన్సులను జారీ చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి దోహదపడేలా బ్యాంకింగ్ రంగ విస్తరణపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్బీఐ చర్చిస్తున్నట్టు చెప్తున్నారు. 2014 తర్వాత మరోసారి నూతన బ్యాంకుల కోసం ఆర్బీఐ లైసెన్సులు ఇచ్చే వీలుందని ఓ కథనంలో బ్లూంబర్గ్ తెలిపింది. అయితే అటు ఆర్థిక శాఖ నుంచిగానీ, ఇటు ఆర్బీఐ నుంచిగానీ దీనిపై ఎలాంటి స్పందనా రాలేదు.



# మే 2025లో 9 నెలల కనిష్ఠానికి భారత పారిశ్రామిక వృద్ధి

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి **మే 2025లో కేవలం 1.2%**కు పరిమితమైందని జాతీయ గణాంక కార్యాలయం (NSO) వెల్లడించింది. ఇది గత 9 నెలల కనిష్ఠ స్థాయిగా నిలిచింది. విద్యుత్ ఉత్పత్తి మరియు గనుల రంగాల్లో తీవ్ర మందగమనం ఈ వృద్ధి తగ్గుదలకు ప్రధాన కారణాలుగా గుర్తించబడింది.

ఈ గణాంకం ఏప్రిల్‌లో నమోదైన 2.6% వృద్ధితో పోలిస్తే గణనీయమైన క్షీణతను చూపుతోంది. అంతేకాక, ఏప్రిల్ గణాంకాన్ని మునుపటి అంచనా 2.7% నుంచి దిగువకు సవరించారు.

ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (IIP) ప్రకారం, విద్యుత్ ఉత్పత్తి 5.8% క్షీణించగా, గనుల ఉత్పత్తి 0.1% తగ్గుదలను ఎదుర్కొంది. ఈ రంగాలలోని బలహీనత పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రభావాన్ని చూపుతోంది. అయితే, తయారీ రంగం మాత్రం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. యంత్రాలు, ప్రాథమిక లోహాలు, నాన్ మెటాలిక్ ఖనిజాలు వంటి ఉపరంగాల్లో వృద్ధితో కలిపి తయారీ రంగం 2.6% వృద్ధిని నమోదు చేసింది. కానీ ఇది గత సంవత్సరం మే నెలలో నమోదైన 5.1% వృద్ధితో పోలిస్తే తక్కువగా ఉంది.

రంగాల వారీగా విశ్లేషిస్తే:

- వినియోగ వస్తువుల ఉత్పత్తి బలహీనంగా కొనసాగుతోంది — ఇది వినియోగ డిమాండ్‌లో మందగమనాన్ని సూచిస్తోంది.
- క్యాపిటల్ గూడ్స్ మరియు మౌలిక సదుపాయాల ఉత్పత్తి మాత్రం కొంత హోరుతెచ్చాయి, అయితే ఇవి మొత్తం పారిశ్రామిక వృద్ధిపై మరింత బలమైన ప్రభావాన్ని చూపలేకపోయాయి.

మేలో IIP సూచీ విలువ 156.6గా ఉండగా, ఇది మే 2024లోని 154.7తో పోలిస్తే స్వల్ప పెరుగుదలే అయినప్పటికీ, వృద్ధి రేటు మందగించింది. ఇది అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు మరియు దేశీయ డిమాండ్ లోపం మధ్య పారిశ్రామిక పునరుద్ధరణ సుస్థిరతపై సందేహాలను కలిగిస్తోంది.

ఈ వృద్ధి మందగమనం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) యొక్క ద్రవ్య విధాన నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల మధ్య, ఆర్బీఐ వృద్ధిని ఎలా ప్రోత్సహించాలి అన్నదానిపై చర్చలు కీలకంగా మారే అవకాశం ఉంది.

# చిరుద్యోగి టు సీఈఓ జర్నీ..



ప్రియా నాయర్.. వ్యాపార ప్రపంచంలో ఈమె తెలియనివారుండరు. 2014 లో చాలా రాష్ట్రాల్లో కరెంటు కోతలెక్కువ. ఇంటర్నెట్ పరిచయమే లేదు. టీవీల్లేని పల్లెటూర్లే ఎక్కువగా ఉండేవి. హెచ్‌యూఎల్ దేశంలోనే పేరున్న ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ సంస్థ. దీని వినియోగదారులు ఎక్కువగా గ్రామీణులే. మరి వారికి కొత్త ఉత్పత్తులను పరిచయం చేయడమెలా? అప్పుడే ఓ కొత్త క్యాంపెయిన్ కి శ్రీకారం చుట్టారు ప్రియ. తక్కువ ధరకే వస్తుండటంతో బేసిక్ ఫోన్ అందరి ఇళ్లల్లో కనిపించడం మామూలైంది. దీంతో పాట, జోక్, చిన్న సీన్స్ వినాలనుందా... మా నంబరుకి ఒక్క మిస్డ్ కాల్ ఇవ్వండి అని ప్రచారం మొదలుపెట్టారు. డబ్బులెలాగూ ఖర్చవ్వవు అని చాలామంది ట్రై చేశారు. మిస్డ్ కాల్ ఇస్తే తిరిగి కాల్ రావడమే కాదు... చెప్పినట్టుగానే ఎంటర్‌టైన్‌మెంట్ ఉండేది. కాకపోతే మధ్యలో యాడ్‌లూ వస్తాయి. అప్పట్లోనే మూడు కోట్ల మందికి చేరువైందీ క్యాంపెయిన్. అంతేకాదు పల్లెలకి రిన్, క్లోజ్‌అప్, వీల్ వంటి ఎన్నో ఉత్పత్తులు పరిచయమయ్యాయి. ఆస్కార్ ఆఫ్ అడ్వర్టైజ్‌మెంట్ గా చెప్పే కేన్స్ లయన్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ క్రియేటివిటీ నుంచి మూడు గోల్డెన్ లయన్స్ అవార్డులూ వచ్చాయి. ఒకప్పుడు ఇది చాలామంది బిజినెస్ విద్యార్థులకు బిజినెస్ లెసన్ కూడా. ప్రియ వాళ్లది మలయాళం ఫ్యామిలీ. కానీ ఆమె పెరిగిందంతా ముంబయిలో. బీకాం, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంబీఏ పూర్తిచేశారు. చదువవ్వగానే హెచ్‌యూఎల్ సేల్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉద్యోగంలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2012కల్లా మేనేజ్‌మెంట్ బోర్డులో స్థానం సంపాదించారు. 2022లో బ్యూటీ అండ్ వెల్‌బీయింగ్ విభాగానికి గ్లోబల్ సీఎంఓ అయ్యారు. ప్రస్తుతం అదే విభాగానికి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. తాజాగా సీఈఓ అండ్ ఎండీగా సెలెక్ట్ అయ్యారు. దాదాపు ముప్పై ఏళ్ల అనుభవం. అలాగని సులువుగా ఏమీ సాగలేదామె ప్రయాణం. ఫస్ట్ డేస్ లో మార్కెటింగ్‌లో, ఫ్యాక్టరీల్లో అమ్మాయిలే కనిపించేవారు కాదు. ఎంత కష్టమైన పనైనా చేస్తూ వెళ్లారామె. ఫ్యాక్టరీల్లో మహిళలకు టాయ్‌లెట్లూ ఉండేవి కాదు. అవి వచ్చేలా చూశారు. మార్గం లేదా? అయితే సృష్టించడమే అనే సిద్ధాంతాన్ని నమ్మేవారు ప్రియ. తను పడిన ఇబ్బందులు తరవాతి తరం మహిళలు పడొద్దు అనుకునేవారట. మనసుతో ఆలోచిస్తారు.. ప్రియ గురించి చాలామంది చెప్పే మాటలివి. ఆమె నడిపిన బ్రాండ్‌లన్నీ ఏదోక సందేశాన్ని మోసుకెళ్లేలా చూసేవారు. సస్టెయినబిలిటీ, కార్బన్ ఉద్గారాలు తగ్గించడం, తక్కువ నీరు వాడకం... ఇలా ఎన్నో మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులను తీసుకొచ్చారు. నేను రెండు ప్రధాన సూత్రాలను బలంగా నమ్ముతా. మనం చేసే ప్రతి పనికీ ఓ కారణం ఉండాలి. అది నలుగురికీ సాయపడాలి అనుకుంటా. సహానుభూతితో ఆలోచించినప్పుడే వాటి గురించి తెలుసుకోగలం. అందుకే ఈగోలకు తావివ్వను. బోర్డు సభ్యులైనా, పల్లెటూరి వినియోగదారుడైనా... ఎవరు చెప్పినా వింటాను. శక్తిమంతమైన వ్యక్తులు, బ్రాండ్‌లుగా ఎదిగే ఎవరైనా పాటించే నియమాలే ఇవి. ఇక రెండోది.. నేర్చుకోవడానికి వయసు, స్థాయి అంటూ ఉండవు. ఇదో నిరంతర ప్రక్రియ అనే ప్రియ.. ఉద్యోగంలో పాతికేళ్ల అనుభవం వచ్చాక హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎగ్జిక్యూటివ్ కోర్సుని చేశారు. ఇందుకు స్ఫూర్తి మాత్రం తల్లే అంటారామె. అమ్మ డాక్టర్. పేదలకు ఉచితంగా వైద్యం అందించేవారు. 70ఏళ్ల వయసులోనూ కొవిడ్ సమయంలో ముంబయి మురికివాడల్లో తిరుగుతూ సేవలందించారామె. కరోనా సోకినా భయపడలేదు. నా మీద అమ్మ ప్రభావం చాలా ఎక్కువ అంటారామె. అంతేకాదు, ఎదగడానికి మారాల్సిన పనిలేదు. మనసుతో ఆలోచించేతత్వం, దృఢమైన సంకల్పం, మనం చేసే దానికో ప్రయోజనం ఉంటే చాలు... ఎవరైనా అగ్రస్థానానికి చేరుకోవచ్చనే ప్రియ ప్రయాణం... గాజు తెరలను బద్ధలు కొడుతూ సీసూట్‌లో స్థానం సంపాదించాలనుకునే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయకమే. ఆమె నడిచిన మార్గం నేడు ఎంతోమందికి మర్గదర్శకంగా నిలిచింది. అంతేకాకుండా ఆమె చూపించిన మార్గంలో ఇప్పటికే ఎంతోమందికి ఉపాధి లభించింది. అందుకే ప్రియ ఎంతోమందికి స్ఫూర్తి మాత్రమే కాదు.. ఆమె అంటే ఎంతోమంది ఉద్యోగులకు అపారమైన గౌరవం.

# నైట్ మొత్తం మీ ఫోన్‌ను ఛార్జ్ చేస్తున్నారా?



ఇప్పటి డిజిటల్ వరల్డ్ లో స్మార్ట్ ఫోన్ లు మన లైఫ్ లో చాలా వరకు ఒక భాగంగా మారాయి. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, చెల్లింపులు, పని, వీడియోలు లేదా సోషల్ మీడియా కోసం అయినా స్మార్ట్‌ఫోన్ లేకుండా మనం ఏమీ చేయలేము. స్మార్ట్‌ఫోన్‌లు మన జీవితాల్లో చాలా వరకు కీ రోల్ ను ప్లే చేస్తున్నాయి. అలాంటి స్మార్ట్‌ఫోన్ లను సరిగ్గా నిర్వహించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఛార్జింగ్ విషయంలో మనం చాలా తప్పులు చేస్తాం. చాలా మంది తమ ఫోన్‌లను రోజంతా ఉపయోగిస్తారు కాబట్టి వారు రాత్రిపూట మాత్రమే వాటిని ఛార్జ్ చేసి ఉదయం వాటిని బయటకు తీస్తారు. ఇది చాలా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మీరు మీ ఫోన్‌ను రాత్రంతా ఛార్జ్ చేసినప్పుడు ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. చాలా మంది తమ ఫోన్‌లను రోజంతా ఉపయోగిస్తారు. అందుకే రాత్రిపూట వాటిని ఛార్జ్ చేస్తారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఒక సాధారణ పద్ధతి. రాత్రంతా ఫోన్‌ను ఛార్జ్‌లో ఉంచడం వల్ల బ్యాటరీ లైఫ్, ఫోన్ పనితీరుపై ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల మన ఫోన్ బ్యాటరీ దెబ్బతింటుంది. కొన్ని గంటల ఉపయోగం తర్వాత అది త్వరగా ఛార్జ్ కోల్పోయే ప్రమాదం ఉంది. దీని వల్ల మీరు దాన్ని తరచుగా ఛార్జ్ చేయాల్సి వస్తుంది. నేటి స్మార్ట్‌ఫోన్ కంపెనీలు లిథియంఅయాన్ బ్యాటరీలను ఉపయోగిస్తున్నాయి. ఇవి లేటెస్ట్ టెక్నాలజీతో రూపొందించబడినప్పటికీ, కొన్ని సమస్యలను నివారించలేము. ముఖ్యంగా ఫోన్ పూర్తిగా ఛార్జ్ అయినప్పుడు అది పూర్తిగా ఖాళీ అయిన తర్వాత మాత్రమే ఛార్జ్ అవుతుంది. అదే విధంగా పూర్తిగా ఛార్జ్ అయిన తర్వాత కూడా ఛార్జర్ నుండి బ్యాటరీని తీసివేయకపోవడం కూడా ప్రమాదకరం. 100% ఛార్జ్ అయిన తర్వాత కూడా ఫోన్‌ను ఎక్కువసేపు ఛార్జ్‌లో ఉంచడం వల్ల అది వేడెక్కుతుంది. ఇది బ్యాటరీ నిర్మాణాన్ని దెబ్బతీయడమే కాకుండా, కొన్నిసందర్భాల్లో ఫోన్ పేలిపోవడానికి లేదా మంటలు చెలరేగడానికి కారణమవుతుంది. ఫోన్లు పేలి కొంతమంది మరణించిన సంఘటనల గురించి మనం వార్తల్లో ఎన్నో చూశాము. అందుకే ఫోన్ 0% చేరకముందే ఛార్జ్ చేయండి. ఫోన్ 100% ఛార్జ్ అయిన తర్వాత ఛార్జర్ నుండి తీసివేయండి. అవసరం అనుకుంటే 80 శాతం మాత్రమే ఛార్జ్ చేస్తే ఇంకా మంచిది. అలాగే, ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్‌ను ఉపయోగించవద్దు. దీనివల్ల వేడి పెరుగుతుంది. రాత్రంతా ఛార్జింగ్ పెట్టే అలవాటు మానుకోండి. నేటి స్మార్ట్‌ఫోన్‌లలో బ్యాటరీని రక్షించడానికి బ్యాటరీ రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. మీరు 100 లేదా 80 శాతం వరకు మాత్రమే ఛార్జ్ కావాలంటే ఆటో ఫీచర్‌ను ఆన్ చేస్తే ఆటోమెటిక్‌గా నిలిచిపోతుంది. ఇంకో విషయం ఏంటంటే మీ ఫోన్ బ్యాటరీ కనీసం 20 శాతం ఉండగానే ఛార్జ్ చేయడం మంచిది.

# సెన్సేషనల్ యాప్.. ఫోన్‌లో నెట్ లేకున్నా ఉపయోగం?


పాపులర్ టెక్నాలజీ సంస్థ గూగుల్ మరో సంచలనానికి తెరతీసింది. ఇప్పటి వరకు ఏ యాప్ యూజ్ చేయాలన్నా మన ఫోన్‌లో ఇంటర్నెట్ ఉండాల్సిందే. అయితే.. తాజాగా గూగుల్ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ పేరిట ఓ కొత్త AI యాప్‌ను తీసుకొచ్చింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రోజు రోజుకూ కొత్త తరహా ఫీచర్లు తీసుకొస్తున్న టైమ్ లో.. మన స్మార్ట్ ఫోన్లలో ఏఐ వినియోగాన్ని డిఫరెంట్ అండ్ ఇంట్రెస్ట్‌గా మార్చే ఈ క్రేజీ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ క్రేజీ యాప్ ద్వారా మన ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా మనం ఏఐ మోడల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ యాప్ ద్వారా మీ ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా ఏఐ మోడల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇంటర్నెట్ లేకున్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఇమేజ్‌లను క్రియేట్ చేయడం, కోడ్ రాయడం, సమాధానాలు రాబట్టడం వంటివి సులభంగా చేయొచ్చు. ఇందులో మరో మెయిన్ విషయం ఏమిటంటే.. యూజర్ ప్రైవసీకి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే యూజర్లు అందించే డేటా క్లౌడ్ సర్వర్లకు వెళ్లకుండా మొత్తం మొబైల్ ఫోన్లో బ్యాక్‌ఎండ్‌లో రన్ అవుతుంది. ఇది సెక్యూరిటీ రిస్క్‌ను కూడా తగ్గిస్తుంది. అలాగే పనితీరు కూడా చాలా చాలా వేగంగా ఉంటుంది. సర్వర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా యూజర్లు అడిగే ప్రశ్నలకు వెంటనే రిప్లయ్ ఇచ్చే ఆస్కారం ఏఐకి ఉంటుంది. అయితే గూగుల్ ఏఐ ఎడ్జ్ యాప్ గెమ్మా 31బీ అనే లాంగ్వేజ్ మోడల్‌పై ఆధారపడి పనిచేస్తుంది. కేవలం 529 ఎంబీ పరిమాణంలో వచ్చే కాంపాక్ట్ మోడల్. అపాచీ 2.0 లైసెన్స్‌తో వస్తోంది. ఇది విద్య, బిజినెస్ అవసరాలకు కూడా వినియోగించుకునేందుకు అనుమతిస్తుంది. ఇది ఒక సెకనుకు 2,585 టోకెన్లను ప్రాసెస్ చేయగలదు. పెద్ద మొత్తంలో టెక్స్‌ను ఇట్టే క్షణాల్లో జనరేట్ చేయగలదు.




గెమ్మా పరిమాణం చిన్నదైనప్పటికీ కంటెంట్ క్రియేట్ చేయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం, స్మార్ట్ రిప్లయ్ ఇవ్వడం వంటి పనులను క్షణాల్లో చేయగలదు. ప్రస్తుతానికి ఈ Google AI Edge Gallery యాప్ ఓపెన్ సోర్స్‌లో అందుబాటులో ఉంది. త్వరలోనే ఈ గూగుల్ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ యాప్ ఐఓఎస్ వెర్షన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు గూగుల్ ప్రకటించింది.

# కొలెస్ట్రాల్ కంట్రోల్.. సూపర్ ఫుడ్స్ ఇవే..

శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం అనేది ఇప్పటి లైఫ్ స్టైల్ లో మెయిన్ హెల్త్ ప్రాబ్లెమ్ గా మారింది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బులకు, స్ట్రోక్‌కు దారితీసే ప్రధాన కారణాలలో ఒకటి. అయితే మనం తీసుకునే ఆహారంలో కొన్ని రకాల సూపర్‌ఫుడ్స్ చేర్చడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచవచ్చు. అందుకే తినే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఓట్స్, బార్లీ, బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాలలో సాల్యుబుల్ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఫైబర్ జీర్ణవ్యవస్థలో జిగురు లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది. అంతే కాకుండా ఇది ఆహారంలో ఉన్న కొలెస్ట్రాల్‌ను రక్తంలోకి గ్రహించకుండా అడ్డుకుంటుంది. రోజుకు ఒక కప్పు వోట్మీల్ లేదా బార్లీ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. బాదం, వాల్‌నట్స్, వేరుశనగ, చియా గింజలు, అవిసె గింజలు వంటి వాటిలో ఆరోగ్యకరమైన మోనో అన్సాచురేటెడ్, పాలీ అన్సాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్ , ప్లాంట్ స్టెరాల్స్ ఉంటాయి. ఈ పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ముఖ్యంగా వాల్‌నట్స్ , అవిసె గింజలలో ఉండే ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అవకాడోలో మోనోఅన్సాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా.. అవకాడోలో ఉండే బీటాసిటోస్టెరాల్ అనే ప్లాంట్ స్టెరాల్, కొలెస్ట్రాల్‌ను గ్రహించడాన్ని నిరోధిస్తుంది. అవకాడో ఆరోగ్య సమస్యలు కూడా రాకుండా చేస్తుంది. శనగలు, రాజ్మా, పెసలు, కందులు వంటి చిక్కుళ్ళు, బీన్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇవి కొలెస్ట్రాల్‌ను కంట్రోల్ చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అంతేకాకుండా.. వీటిలో ఉండే ప్రోటీన్, ఇతర పోషకాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే వీటిని తినడం చాలా మంచిది. సాల్మన్, మాకెరెల్, సార్డిన్ వంటి కొవ్వు చేపలలో ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులు ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించి..గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వారానికి కనీసం రెండు సార్లు చేపలు తినడం మంచిది. యాపిల్స్, ద్రాక్ష, సిట్రస్ పండ్లు, బెర్రీస్ వంటి పండ్లలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, వంకాయ, ఓక్రా, ఆకుకూరలు వంటి కూరగాయల్లో కూడా అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఈ సూపర్‌ఫుడ్స్‌ను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్‌ను సహజంగా నియంత్రించుకోవచ్చు. కేవలం ఆహారం మాత్రమే కాకుండా.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం కూడా చాలా ముఖ్యం. దీంతో పాటు మానసిక ఒత్తిడిని దరికి చేరనివ్వకండి. ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా సాధారణ విషయంగా మారిపోయింది. అయినా వీలైనంతగా తగ్గించే ప్రయత్నం చేయాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఇలాంటి ఐడియాలు ఎలా వస్తాయో..

# ఈ ఏసీకి ఫిదా!



ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది.. ఇది చాలామంది జీవితాల్లో ఎన్నో సందర్భాల్లో ప్రూవ్ అయ్యింది కూడా. జీవితాల్ని ఏమోగాని ఈ ఐడియా అక్కడి ప్రజల కష్టాలు మాత్రం మార్చేసింది. జుగాడ్ సహాయంతో తమ పనిని ఎలా నిర్వహించాలో బాగా తెలిసిన ప్రజలు ప్రపంచంలో చాలా దేశాలు ఉన్నాయి. ఈ వ్యక్తులు, సాధారణ వస్తువులను ఉపయోగించి అద్భుతాలు సృష్టిస్తుంటారు. అలాంటి జుగాడ్ వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఒక వ్యక్తి జుగాడ్ ఐడియాకు నెటిజన్స్ షాక్ అవుతున్నారు. సంతోషంగా జీవించాలంటే ధనవంతులై ఉండాల్సిన పని లేదని చిన్న చిన్న ఐడియాలో కూడా ఆనందంగా జీవించవచ్చని ఇది చాటి చెబుతుంది. వైరల్ అవుతున్న ఈ వీడియో దక్షిణ ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ జిల్లాకు చెందినది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మండే వేడి ప్రజల పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఇక్కడ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, నీలిరంగు టాక్సీ డ్రైవర్ వేడి నుండి తప్పించుకోవడానికి ఓ జుగాడ్ ఆలోచనతో చేశాడు. వెంటనే ఓ పరికరాన్ని అమర్చాడు. ఇది చూసిన తర్వాత నెటిజన్స్ షాక్ అవుతున్నారు. అతను తన వాహనాల్లో చేతితో తయారు చేసిన ఎయిర్ కూలర్ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో, చాలా మంది కూలింగ్ సిస్టమ్‌లను ఇన్‌స్టాల్ చేసుకోగా మరొకొంత మంది ఎయిర్ కండిషనింగ్ యూనిట్లను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో ఒకటి ఆఫ్ఘనిస్తాన్. వాతావరణ మార్పుల ప్రభావం ఈ దేశంపై ఎక్కువగ ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఇక్కడి ప్రజలపై తీవ్ర ప్రభావం చపుతుంది. ఈ క్రమంలో కారు చౌకగా లభించిఏ వస్తువులతో కారు డ్రైవర్లు ఇలా జుగాడ్ ఏసీలు సృష్టించారు. తమకే కాకుండా ప్రయాణికులకు సైతం చల్లదనాన్ని అందిస్తున్నారు. ఈ వీడియోను చూసిన నెటిజన్స్ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ వీడియోనే కాదు.. ఈ ఏసీ కూడా చాలామందికి హెల్ప్ అవుతుంది.




# కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ..

లార్డ్స్ వేదికగా టీమిండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడో టెస్టు జరుగుతుంది. ఈ మ్యాచ్ లో మొదట ఇంగ్లాండ్ జట్టు బ్యాటింగ్ చేసింది. 387 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇక టీమిండియా బ్యాటింగ్ చేస్తోంది. టీమిండియా 254/5 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఓపెనర్ కే.ఎల్. రాహుల్ అద్బుతమైన సెంచరీ చేశాడు. 176 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్ లో 13 ఫోర్లు ఉన్నాయి. అయితే లంచ్ సమయానికి ముందు రాహుల్ సెంచరీ చేసేందుకు అవకాశం ఇచ్చేందుకు రన్ కి ట్రై చేశారు. రిషబ్ పంత్ 74 పరుగులు చేసి అనవసర రన్ కి ట్రై చేసి ఔట్ అయ్యాడు. కే.ఎల్. రాహుల్ సెంచరీ చేశాడనే సంతోషం కొద్ది సేపు కూడా నిలవలేకపోయింది. సెంచరీ చేసిన కొద్ది సేపటకే క్యాచ్ ఔట్ గా వెనుదిరిగాడు రాహుల్. దీంతో రాహుల్ ఔట్ కాగానే నితీశ్ రెడ్డి క్రీజులోకి వచ్చేశాడు. అయితే లంచ్ బ్రేక్ సమయానికి టీమిండియా 65.3 ఓవర్లకు 4 వికెట్లు మాత్రమే నష్టపోయింది. లంచ్ కంటే ముందు బషీర్ బౌలింగ్ లో సింగిల్ కోసం ప్రయత్నించిన పంత్ ను బెన్ స్టోక్స్ రన్ ఔట్ చేశాడు. 248 పరుగుల వద్ద టీమిండియా 4వ వికెట్ ను కోల్పోయింది. తర్వాత అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించేశారు. కేఎల్ రాహుల్ 98 పరుగుల వద్ద పంత్ రనౌట్ కాగానే.. క్రీజులోకి జడేజా వచ్చాడు. ఆ తరువాత సెంచరీ చేసిన రాహుల్ కొద్ది సేపటికీ క్యాచ్ ఔట్ అయ్యాడు. రాహుల్ కోసం పంత్ రన్ ఔట్ కావడం.. ఇక రాహుల్ కూడా ఔట్ కావడంతో టీమిండియా 5 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ఆల్ రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా క్రీజులో ఉన్నారు. భారత బ్యాటర్లు ఆచితూచి ఆడుతున్నారు. ఇద్దరూ ఆల్ రౌండర్లు నెమ్మదిగా ఆడుకుంటున్నారు. ఒకవేళ వికెట్ కోల్పోతే.. టీమిండియా కష్టాల్లో పడుతుందని మెల్లగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి మంచి ఫామ్ లో ఉన్న రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ ఇద్దరూ లంచ్ కి ముందు ఒకరు ఔట్ అయితే.. లంచ్ తరువాత ఒకరు పెవిలీయన్ కి చేరడం విశేషం. టీమిండియా బ్యాటర్లలో కేఎల్ రాహుల్ ఒక్కడే సెంచరీ చేశాడు. అతనికి తోడు రిషబ్ పంత్ 4 పరుగులు చేసి సెంచరీ మిస్ చేసుకున్నాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 1, కరుణ్ నాయర్ 40, గిల్ 16 పరుగులు మాత్రమే చేశారు. మరి ఈ టెస్ట్ లో టీమిండియా ప్రయత్నం ఎలా ఉంటుందో చూడాలి.

# నాకేమీ 21 ఏళ్లు కాదుగా: బుమ్రా

ఇంగ్లాండ్ తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. దీంతో లార్డ్స్‌లో ఆనర్స్ బోర్డు పై పేరు నమోదు చేసుకొనే అవకాశం దక్కించుకున్నాడు. ఐదో వికెట్ తీసిన తర్వాత పెద్దగా సంబరాలు చేసుకోలేదు. దీనికి కారణం ఏంటా? అని క్రికెట్ అభిమానుల్లో ప్రశ్నలు తలెత్తాయి. దానికి జస్‌ప్రీత్ బుమ్రానే సమాధానం ఇచ్చాడు. రెండో రోజు ఆట ముగిసిన తర్వాత బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. నిజం చెప్పాలంటే నేను బాగా అలసిపోయా. అందుకే ఎక్కువగా సంబరాలు చేసుకోలేకపోయా. మైదానంలో చాలా సమయంపాటు బౌలింగ్ చేశా. దీంతో శారీరకంగా అలసిపోయా. ఎగిరి గంతులు వేయడానికి ఇప్పుడు నేనేమీ 2122 ఏళ్ల కుర్రాడిని కాదు. మామూలుగానే అలా చేయడానికి ఇష్టపడను. అయితే, నా ప్రదర్శనపై ఆనందంగా ఉన్నా. ఐదో వికెట్ వచ్చాక మళ్లీ బౌలింగ్‌ను కొనసాగించడానికి తర్వాత బంతి వేసేందుకు వెళ్లిపోయా అని బుమ్రా చెప్పుకొచ్చారు. లార్డ్స్ టెస్టులో తొలిరోజు 18 ఓవర్లు వేసిన బుమ్రా ఒక వికెట్ తీయగా.. రెండోరోజు 9 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇందులో నలుగురు ఇంగ్లాండ్ బ్యాటర్లను బౌల్డ్ చేయడం హైలెట్ గా నిలిచింది. టెస్టుల్లో బుమ్రా 15వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. విదేశాల్లో 12వ సారి కావడం గమనార్హం. దీంతో కపిల్ దేవ్ ను అధిగమిస్తూ విదేశాల్లో అత్యధిక ఫైఫర్‌లు నమోదు చేసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశారు. కాగా బుమ్రా బౌలింగ్ లో అత్యధిక వికెట్లు తీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన సాలిడ్ రికార్డ్ ను సైతం క్రియేట్ చేశారు. దీంతో పాటు బుమ్రా తన ఫ్యామిలీకి కూడా అంతే ఇంపార్టెన్స్ ఇస్తూ.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా కూడా ఉంటారు. దీంతో ప్రజంట్ బుమ్రా చేసిన ఈ కామెంట్స్ తెగ వైరల్ అవుతున్నాయి.







# ఆర్చరీ వరల్డ్ కప్.. భారత్‌కు రజతం, కాంస్యం

స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 4 లో భారత మహిళా టీమ్ పతకాల వేట కొనసాగిస్తోంది. జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, ప్రీతికా ప్రదీప్ లతో కూడిన టీమ్ శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్లో రజతం కొల్లగొట్టింది. పోడియం మీద మువ్వన్నెల జెండాను ఈ ముగ్గురు రెపరెపలాడించగా.. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ గురి అదరడంతో కాంస్యం కూడా వచ్చి చేరింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 16 ఏళ్ల ప్రీతికా 2,116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దాంతో, భారత టీమ్ ఫైనల్ కు దూసుకెళ్లింది. అయితే.. పసిడి పోరులో ఒత్తిడికి లోనైన టీమ్ రెండో స్థానంతో సిల్వర్ మెడల్‌కే పరిమితమైంది. చైనీస్ తైపీ బృందం స్వర్ణం సొంతం చేసుకుంది. తర్వాత జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో సురేఖ, రిషభ్ యాదవ్ 1,431 పాయింట్లతో వరల్డ్ రికార్డు నెలకొల్పారు. పదో సీడ్ జంటను చిత్తు చేసి దేశానికి కాంస్యం అందించారు. అయితే.. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో మాత్రం భారత ఆర్చర్లు తీవ్రంగా నిరాశపరిచారు. నెదర్లాండ్స్‌కు చెందిన 12వ సీడ్‌ల ముందు నిలువలేక వెళ్లిపోయారు. కాగా గత కొన్ని రోజులు భారత టీమ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.

# డ్యూక్స్ బాల్స్ వివాదంపై గావస్కర్ ఏమన్నారంటే?



ఇంగ్లాండ్, టీమిండియా టీమ్స్ మధ్య టెస్టు సిరీస్‌లో ఇప్పుడు బంతులపై చర్చ జరుగుతోంది. డ్యూక్స్ బంతులు త్వరగా తమ ఆకారాన్ని కోల్పోతున్నాయని రెండు టీమ్స్ ప్లేయర్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. రెండోరోజు కొత్త బంతి కేవలం పది ఓవర్లలోపే ఆకారం మారిపోవడం గమనార్హం. బంతిని మార్చే క్రమంలో అంపైర్లు సరిగ్గా వ్యవహరించలేదని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ సిరాజ్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ ఇదే పరిస్థితి ఎదురై ఉంటే బ్రిటన్ మీడియా పెద్ద రాద్ధాంతం చేసి ఉండేదని కామెంట్ చేశారు. ఇంగ్లాండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ కూడా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. మార్చిన బంతిని చూస్తే అదేమీ 10 ఓవర్లు ఆడిన బాల్ మాదిరిగా లేదు. 20 ఓవర్ల కంటే ఎక్కువే అయి ఉండొచ్చు. ఒకవేళ ఇదే బంతి మార్పు అంశం భారత్ లో జరిగి ఉంటే.. కనీసం బంతిని మార్చేంత కూడా లేదా అని బ్రిటీష్ మీడియా దీనిపై పెద్ద రాద్ధాంతం చేసేసేది అని గావస్కర్ అన్నారు. క్రికెట్ బంతి ఇలా త్వరగా ఆకారం మారిపోవడం ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. గతంలో లేనివిధంగా ఇప్పుడు ఎక్కువగా ఈ బాల్స్ గురించి మాట్లాడుతున్నామంటే సమస్య ఉన్నట్లేగా. ప్రతి ఇన్నింగ్స్‌లోనూ బంతిని మారుస్తున్నట్లు కనిపిస్తోంది. డ్యూక్స్ బంతుల్లో ప్రాబ్లమ్ ఉంది. త్వరగా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. బంతి కనీసం 80 ఓవర్ల వరకూ మార్చకుండా ఉండేలా చూడాలి. అంతేకానీ, 10 15 ఓవర్లకే మార్చుకుంటూ పోతే ఎలా? అని తన సోషల్ మీడియాలో పోస్ట్ ను షేర్ చేశారు. డ్యూక్స్ బంతుల తయారీ సంస్థ యజమాని దిలీప్ జగోడియా మాత్రం డిఫరెంట్ గా రెస్పాన్స్ అయ్యారు. క్రికెట్ సూపర్ స్టార్లకు కాస్త ఓపిక అవసరం. వివాదాస్పదమైన అంశం విషయంలో చర్యలు తీసుకొంటాం. మాది 18వ శతాబ్దం నుంచి వస్తోన్న కంపెనీ. ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకుంటూనే వస్తున్నాం. ప్రస్తుతం యూకేలో అసాధారణమైన వేడి వాతావరణం కూడా బంతి ఇలా మారిపోవడానికి కారణమై ఉండొచ్చు. ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లు బరువైన బ్యాట్‌లను వాడుతున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి అని వెల్లడించారు. అయితే ఈ పోస్ట్ పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

# భారత్ చేతుల్లో మ్యాచ్.. క్రేజీ స్ట్రాటజీ..


మొదటి రెండు టెస్టులకు భిన్నంగా సాగుతోంది లార్డ్స్ టెస్ట్. ఈ మ్యాచ్‌లో సెషన్ సెషన్‌కూ ఆధిపత్యం చేతులు మారుతూ పోతోంది. డే 1 రెండు టీమ్స్ బాగా పోరాడాయి. అయితే ఇంగ్లండ్ కాస్త పైచేయి సాధించింది. కానీ రెండో రోజు ఆటలో బౌలర్లు చెలరేగడంతో భారత్ డామినేషన్ నడిచింది. ఆ తర్వాత బ్యాటర్లు కూడా రాణించడంతో డే2ను సానుకూలంగా ముగించింది భారత్. కానీ శుబ్‌మన్ గిల్, అంతకంటే ముందు కరుణ్ నాయర్ వికెట్లను కోల్పోవడంతో ఎడ్జ్ సాధించలేకపోయింది మెన్ ఇన్ బ్లూ. ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 242 పరుగుల దూరంలో ఉంది భారత్. మూడ్రోజులు మిగిలి ఉన్న ఈ టెస్టులో ఫలితం రావడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే రిజల్ట్ మనకు అనుకూలంగా రావాలంటే మాత్రం ఓ మ్యాజిక్ జరగాల్సిందే. అదేంటంటే.. లార్డ్స్ పిచ్ నుంచి పేసర్లకు మంచి మద్దతు లభిస్తోంది. బంతి ఒక్కోసారి అనూహ్యంగా బౌన్స్ అవుతోంది. స్పిన్నర్లకూ కొంతమేర సపోర్ట్ దొరుకుతోంది. ఒక్కోసారి బాల్ ఊహించిన దాని కంటే కిందకు వస్తుండటంతో బ్యాటర్లు షాట్లు ఆడటం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ స్కోరును దాటాలంటే భారత్ చెమటోడ్చక తప్పని పరిస్థితి. ఒకవైపు వికెట్లను కాపాడుకుంటూనే మరోవైపు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. రాహుల్, పంత్ లీడ్స్‌లో చేసిన మ్యాజిక్‌నే మళ్లీ రిపీట్ చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో వీళ్లిద్దరూ కలిసి నాలుగో వికెట్ కు 195 పరుగుల భారీ పార్టిసిపేషన్ యాడ్ చేశారు. రాహుల్, పంత్ ఔట్ అయినా నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ రూపంలో ఇంకా క్వాలిటీ బ్యాటర్లు టీమిండియాలో ఉన్నారు. అయితే రాహుల్‌పంత్‌కు ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం ఉంది. దీనికి తోడు ఒకరు డిఫెన్స్‌తో ప్రత్యర్థుల ఓపికను పరీక్షిస్తే, మరొకరు అటాక్ చేస్తూ భయపెడుతుంటారు. కాబట్టి వీళ్లు సాధ్యమైనంత ఎక్కువ ఓవర్లు ఆడుతూ భారీ భాగస్వామ్యం నమోదు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తర్వాతి బ్యాటర్లలో జడేజా తప్పితే మిగతా వారికి ఇక్కడ ఆడిన అనుభవం లేదు. నితీష్, సుందర్ పట్టుదలతో ఆడితే భారీ స్కోర్లు కొట్టగలిగే సమర్థులే. దీంతో నితీష్ ఎక్కువసేపు రాణించగలిగితే ఖచ్చితంగా స్కోర్ లో కీలక మార్పులు వస్తాయని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# రణ్ వీర్ తో అట్లీ.. భారీ ప్లాన్స్!



సౌత్ ఇండియా స్టార్ డైరెక్టర్స్ లో రాజమౌళి తర్వాత ముందు వరుసలో అట్లీ ఉంటాడు అనడంలో ఎలాంటి డౌట్ లేదు. ఆయన దర్శకత్వంలో వచ్చిన జవాన్ సినిమా వెయ్యి కోట్లకు మించి వసూళ్లు సాధించడంతో పాటు, బాలీవుడ్ కి జీవం పోసినట్లుగా హిట్ అయింది. అందుకే అట్లీ దర్శకత్వంలో సినిమాలు చేసేందుకు బాలీవుడ్ స్టార్స్ క్యూ కడుతున్నారు. అంతే కాకుండా సౌత్ స్టార్ హీరోలు, సూపర్ స్టార్లు సైతం ఈయన దర్శకత్వంలో సినిమాలు చేసేందుకు గాను ఆసక్తిగా ఉన్నారు. ఈ సమయంలో అట్లీ సౌత్ లో సినిమాను మొదలు పెట్టాడు. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో సినిమా కన్ఫర్మ్ అయింది. ఇప్పటికే AA22XA6 సినిమా షూటింగ్ ను స్టార్ట్ చేశారు. ప్రజంట్ అల్లు అర్జున్‌తో కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్న అట్లీ త్వరలోనే మరో ప్రాజెక్టను ప్రారంభించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ ప్రాజెక్ట్ సినిమా కాదని, అది ఒక యాడ్ ఫిల్మ్ అని తెలుస్తోంది. నిమిషం రెండు నిమిషాల డ్యూరేషన్ తో కాకుండా దాదాపు అయిదు నిమిషాల నిడివి ఉండే విధంగా ఆ యాడ్ ఫిల్మ్ ఉంటుందనే విషయం తెలుస్తుంది. ఇప్పటి వరకు అధికారికంగా ఆ యాడ్ ఫిల్మ్ గురించి ఎలాంటి సమాచారం లేదు. కానీ ఆ యాడ్ ఫిల్మ్‌లో బాలీవుడ్ స్టార్ రణ్వీర్ సింగ్ కనిపించబోతున్నాడు. ఆయన ఈ యాడ్ కోసం యాక్షన్ సీన్స్ లో కనిపిస్తాడని, కామెడీ, యాక్షన్ మెయిన్ గా ఈ కమర్షియల్ యాడ్ ఫిల్మ్ ను అట్లీ భారీ ప్లాన్స్ చేస్తున్నారట. రణ్వీర్ సింగ్‌తో పాటు ఈ యాడ్ ఫిల్మ్ లో కిస్సిక్ బ్యూటీ శ్రీలీల కనిపించబోతుంది. పుష్ప 2 సినిమాలోని ఆ ఐటెం సాంగ్ తర్వాత శ్రీలీల రేంజ్ అమాంతం పెరిగింది. అందుకే ఈ యాడ్‌లో రణ్వీర్ సింగ్ కాంబోగా శ్రీలీలను సెలెక్ట్ చేశారని వార్తలు వస్తున్నాయి. రణ్వీర్ సింగ్, శ్రీలీల కాంబోలో షాట్స్ ఉంటాయి, ఒక యాడ్ ఫిల్మ్ కోసం ఇంత భారీ ప్లాన్స్ చేయడం ఇదే మొదటి సారి అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ యాడ్ ఫిల్మ్ లో ఈ మధ్య కాలంలో మోస్ట్ హ్యాపెనింగ్ స్టార్‌గా నిలిచిన బాబీ డియోల్ కూడా కనిపించబోతున్నాడు. ఈ మధ్య కాలంలో ఈయనకు స్టైలిష్ యాక్టర్, స్టైలిష్ విలన్ అనే పేర్లను అభిమానులు సోషల్ మీడియాలో పెట్టుకుని మాట్లాడుతున్న విషయం తెల్సిందే. ఇంత భారీ స్టార్ కాస్ట్ ఉండటంతో పాటు, ఇండియాస్ టాప్ దర్శకుల్లో ఒకరు అయిన అట్లీ ఈ యాడ్ ఫిల్మ్ కి డైరెక్షన్ చేస్తున్న నేపథ్యంలో అందరి దృష్టిని అట్రాక్ట్ చేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఈ యాడ్ ఫిల్మ్ ను రూపొందించేందుకు గాను ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ను చేస్తున్నారు. ప్రస్తుతం AA22XA6 షూటింగ్ లో ఉన్న అట్లీ అతి త్వరలోనే ఆ యాడ్ షూటింగ్‌కు హాజరు కాబోతున్నాడు. వచ్చే నెలలో ప్రేక్షకులు ఆ యాడ్ ఫిల్మ్ ను టీవీల్లో చూసే అవకాశాలు ఉన్నాయి. రణ్వీర్ సింగ్ వంటి స్టార్‌తో శ్రీలీలకు నటించే అవకాశం దక్కడంతో ముందు ముందు హీరోయిన్‌గా బాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేస్తుందేమో చూడాలి అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.




# అరెవ్వా.. పెద్ది నుంచి శివరాజ్ కుమార్ పోస్టర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా పెద్ది కోసం అందరికీ తెలిసిందే. పక్కా మాస్ మసాలా స్పోర్ట్స్ విలేజ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా భారీ అంచనాలు సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమాకి బుచ్చిబాబు సానా యాక్టర్స్ విషయంలో కానీ తన టెక్నికల్ టీమ్ విషయంలో కానీ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇలా కన్నడ నుంచి మాస్ ప్రెజెన్స్ కలిగిన పవర్ఫుల్ నటుడు శివ రాజ్ కుమార్ ని కూడా తీసుకున్న సంగతి తెలిసిందే. మరి శివ రాజ్ కుమార్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ తనపై అదిరే పోస్టర్ ని రిలీజ్ చేసారు. ఇందులో పూర్తిగా కొత్త లుక్ లో శివ రాజ్ కుమార్ కనిపిస్తుండడం విశేషం. అంతే కాకుండా తాను గౌర్ నాయుడు అనే క్యారెక్టర్ లో కనిపిస్తారని తన క్యారెక్టర్ ని కూడా రివీల్ చేశారు. మరి సినిమాలో తన రోల్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాల్సిందే. ఇక రామ్ చరణ్ సినీ కెరీర్ లో పెద్ది సినిమా మంచి సక్సెస్ అవుతుందని అంచనాలు పెట్టుకున్నారు. ఎందుకంటే రామ్ చరణ్ తీసిన గేమ్ ఛేంజర్ మూవీ భారీ డిజాస్టర్ గా మారడంతో రామ్ చరణ్ తో పాటు మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ కూడా పెద్ది మీదే అన్ని హోప్స్ పెట్టుకున్నారు. ఈ క్రమంలో పెద్ది నుండి వచ్చే ప్రతి అప్డేట్ పై మంచి ఫోకస్ క్రియేట్ అయ్యింది. అందుకే ఆ మూవీ నుండి వచ్చిన లుక్స్, గ్లింప్స్ లాంటివి క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది మూవీతో ఖచ్చితంగా రామ్ చరణ్ పెద్ద సక్సెస్ అందుకోవాలని ఆడియన్స్ ఆసక్తి చూపిస్తున్నారు.

# మయసభ టీజర్.. తెలుగు రాజకీయాలపై టచ్

టాలీవుడ్ ఆడియన్స్ ని ఎంటర్ టైన్ చేసేందుకు మరో పొలిటికల్ స్టోరీ రెడీగా ఉంది. అయితే, ఇది సిల్వర్ స్క్రీన్ పై వచ్చే సినిమా కాదు.. అందుకే పాపులర్ ఓటీటీ సోనీ లివ్ లో స్ట్రీమింగ్ కి రెడీ అవుతుంది. అలాగే మయసభ అనేది కంప్లీట్ వెబ్ సిరీస్. ఈ సిరీస్ ను డైరెక్ట్ చేసేది రిపబ్లిక్ మూవీ ఫేమ్ దేవా కట్టా. ఈ సిరీస్ కు సంబంధించి టీజర్ ను ఫిల్మ్ టీమ్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ గా పొలిటికల్ థ్రిల్లర్ గా రానుంది. ఇక ఈ టీజర్ విషయానికి వస్తే హై ఇంటెన్స్ తో ప్లాన్ చేశారు. అలాగే మన తెలుగు ప్రజలకు ఎంతో పరిచయం ఉన్న ఇద్దరు రాజకీయ నేతలకు సంబంధించిన కథ ఇది అని అర్థమవుతుంది. ఇద్దరు స్నేహితులు, రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా ఎలా మారారు.. ఆ తర్వాత వారి మధ్య రాజకీయ వైరం ఎలా తయారైంది.. అనే కథతో ఈ సిరీస్‌ను దేవా కట్టా తెరకెక్కించాడు. ఇక ఈ సిరిస్‌లో ఆది పినిశెట్టి, చైతన్య రావు మెయిన్ లీడ్స్ లో యాక్ట్ చేస్తున్నారు. దేవా కట్టా మార్క్ డైలాగులు మనకు ఈ టీజర్‌లో వినిపించాయి. టీజర్ ఆసక్తికరంగా ఉండటంతో ఈ వెబ్ సిరీస్‌ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. ఇక ఈ సిరీస్‌ను ఆగస్టు 7 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు సోనీ లివ్ పేర్కొంది. ఇక ఈ సిరీస్ తో మరోసారి దేవా కట్టా తన మార్క్ ను ప్రూవ్ చేసుకోనున్నారు. ప్రీవియస్ గా వచ్చిన రిపబ్లిక్ మూవీ ఇండస్ట్రీ లో తనదైన స్టైల్ ఆఫ్ మార్క్ ను క్రియేట్ చేసింది. ఆ తర్వాత ప్రాజెక్ట్స్ పై ఎలాంటి ఫోకస్ చేయని దేవా కట్టా ఇప్పుడు ఈ సిరీస్ తో మళ్లీ ఆడియన్స్ ముందుకు రానున్నారు.






# వార్ 2 ట్రైలర్ పై స్పెషల్ కేర్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తో పాటు బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కాంబినేషన్ లో డైరెక్టర్ అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా మూవీ వార్ 2. ఈ సినిమా కోసం అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ కూడా చాలా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. నార్త్ లో హృతిక్ చూసుకుంటే సౌత్ సహా యూఎస్ మార్కెట్ లో ఎన్టీఆర్ తన స్టామినా చూపిస్తున్నాడు. అయితే ట్రైలర్ తర్వాత ఇతర పాటలు, ట్రైలర్ లాంటివి ఇంకా రావాల్సి ఉంది. మరి వీటిలో ట్రైలర్ పై ఇంట్రెస్టింగ్ రూమర్ వినిపిస్తుంది. దీనితో అయాన్ ముఖర్జీ స్పెషల్ కేర్ ని విఎఫ్ఎక్స్ విషయంలో తీసుకుంటున్నట్టుగా తెలుస్తుంది. అలాగే ఈసారి ఎన్టీఆర్ పై ఎలివేషన్స్ కూడా గట్టిగా ఉండేలా చూస్తున్నారట. అయితే టీజర్ కి విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో వచ్చిన కామెంట్స్ ఇపుడు రాకుండా మరింత నాచురల్ విజువల్ ఎఫెక్ట్స్ కనిపించే విధంగా డిజైన్ చేయిస్తున్నట్టు తెలుస్తుంది. మరి ఈ ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్ గా వర్క్ చేస్తున్నారు. పైగా ఈమె క్యారెక్టర్ కూడా చాలా సాలిడ్ యాక్షన్ తో ఉండబోతుంది. ముఖ్యంగా ఈ సినిమాలో ఎక్కడా కూడా డిజప్పాయింట్ చేసేలా కనిపించడం లేదు. దీంతో పాటు ఎన్టీఆర్ దేవర మూవీ తర్వాత మరింత ఎఫెక్టివ్ వర్క్ ని అందించే పనిలో ఉన్నట్లు కూడా తెలుస్తుంది. దీంతో ఆడియన్స్ ఆయన లుక్స్ అండ్ యాక్షన్ సీక్వెన్స్ ల కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఇక దేవర 2 పై కూడా ఎన్టీఆర్ ఫోకస్ చేయగా.. ప్రశాంత్ నీల్ తో డ్రాగన్ ప్రాజెక్ట్ పై ఫోకస్ చేస్తున్నారు. మరి ఎన్టీఆర్ నుండి నెక్స్ట్ వచ్చే ప్రాజెక్ట్స్ పై కూడా ఆడియన్స్ ఫుల్ గా ఫోకస్ చేస్తున్నారు.

# స్పిరిట్.. మ్యూజిక్ వర్క్ ఫినిష్?

ప్రభాస్ పాన్ ఇండియా క్రేజ్‌తో చేస్తున్న సినిమాల లైన్ లో స్పిరిట్ ప్రాజెక్ట్ పై స్పెషల్ అంచనాలు ఉన్నాయి. సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో వస్తున్న ఈ యాక్షన్ డ్రామా సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి సినిమాలతో భారీ హిట్స్ అందుకున్న వంగా.. ఇప్పుడు ప్రభాస్‌ను పోలీస్ గెటప్‌లో చూపించబోతున్నాడు. ఇది సందీప్ కు, ప్రభాస్ కు కలిసొచ్చే క్రేజీ కాంబినేషన్ గా ఇండస్ట్రీ అంతా ఇంట్రెస్టింగ్ గా వెయిట్ చేస్తుంది. ప్రభాస్ ఈ సినిమాకి సెప్టెంబర్ నుండి పూర్తిగా డేట్స్ కేటాయించనున్నాడు. ఇప్పటికే రాజాసాబ్ షూట్ ను కంప్లీట్ చేసుకోగా.. వేగంగా పనులు జరుపుతున్న ప్రభాస్, ఆ తర్వాత స్పిరిట్ కోసం పూర్తిగా డెడికేట్ అయ్యేలా ప్లాన్ చేసుకున్నట్టు టాక్. కాగా, రీసెంట్ గా రిలీజ్ అయిన అప్డేట్ ప్రకారం.. సందీప్ తన మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రమేశ్వర్‌తో కలిసి ఈ సినిమా మ్యూజిక్ పనులు పూర్తి చేశారట. స్పిరిట్ సినిమాను మ్యూజికల్ బ్లాక్ బస్టర్ గా క్రియేట్ చేయాలని దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ కలిసి లక్ష్యంగా పెట్టుకున్నారట. ఇప్పటికే హర్షవర్ధన్ తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాడు. ఇప్పుడు స్పిరిట్ కోసం కూడా కంటెంట్ ఉన్న మ్యూజిక్‌తోనే ముందుకు వెళ్తున్నట్లు టాక్. ఈ సినిమాకు సంబంధించి పాటల కంపోజింగ్ పనులు పూర్తయ్యాయని తెలుస్తుండగా, ప్రస్తుతం లిరిక్స్, వోకల్స్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయట. ఈ మ్యూజికల్ స్ట్రాటజీ వల్ల సినిమా నాన్ థియేట్రికల్ మార్కెట్ కూడా పవర్ఫుల్ గా ఉండే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ప్రతి ఎమోషన్‌కు తగిన బీజీఎం ప్లాన్ చేయడం, కథనంలో మ్యూజిక్ కు సెంటర్ స్టేజ్ ఇవ్వడం వంటి పాయింట్లపై సందీప్ చాలా సీరియస్‌గా పనిచేశాడట. ఇదే వంగా స్టైల్‌లో ఉండే మరో సినిమా కావడం వలన స్పిరిట్ లోని సాంగ్స్, స్కోర్ భారీగా ఆకట్టుకుంటాయని యూనిట్ అంటోంది. ఇదిలా ఉంటే.. సెప్టెంబర్ రెండో వారం నుండి సినిమా రెగ్యులర్ షూట్ మొదలు పెట్టేందుకు టీమ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ ప్లాన్ చేయగా, తర్వాత యూరప్‌లో మేజర్ పోర్షన్ షూట్ చేయనున్నారు. కథ మొత్తం పోలీస్ పాత్ర చుట్టూ తిరుగుతుందట. అందుకే ఇందులో ప్రభాస్ లుక్, నటన రెండూ కొత్తగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక ప్రభాస్ ప్రజంట్ బ్యాక్ టు బ్యాక్ భారీ ప్రాజెక్ట్స్ లో యాక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే.

